


WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

RNI NO: TGTEL/25/A0471

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...

రంగారెడ్డి బుధవారం 2-09-2026 సంపుటి: 02 సంచిక : 123 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Ranga Reddy Wednesday, 2-09-2026 Volume :02 Issue: 123 RS: 2 Pages:08 Editor : Katta HimaPavani




## నీట్ నిరసనల కేసులు

# కొట్టివేత

విద్యార్థులు, యువతకు సుప్రీంకోర్టు భారీ ఊరట



- శాంతియుత నిరసనల్లో పాల్గొన్న వారిపై ఎఫ్ఐఆర్‌లు రద్దు
- ఆర్టికల్ 142 కింద సుప్రీంకోర్టు కీలక నిర్ణయం
- తీవ్ర నేరచరిత్ర ఉన్నవారిపై కేసులు కొనసాగింపు
- ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు పరిహారం
- మూడు నెలల్లోగా పరిహారం అందించాలని కేంద్రానికి ఆదేశం
- తీర్పును స్వాగతించిన నీట్ ఉద్యమ సంస్థలు
- సెప్టెంబర్ 5న తలపెట్టిన ఆందోళన విరమణ

న్యూఢిల్లీ

నీట్ యూజీ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై దేశవ్యాప్తంగా జరిగిన విద్యార్థుల నిరసనలకు సంబంధించి నమోదైన ఎఫ్ఐఆర్‌లపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. శాంతియుతంగా నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులు, యువతపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను రద్దు చేస్తూ వారికి చట్టపరమైన ఉపశమనం కల్పించింది. అయితే తీవ్ర నేరచరిత్ర ఉన్న వ్యక్తులు, నిరసనల -మిగతా 2 లో




## గణేష్ ఉత్సవాలు సజావుగా

# నిర్వహించాలి

- అన్ని మండపాలకూ ఉచిత విద్యుత్..
  700 ప్రత్యేక బస్సులు
- ఉత్సవాల నిర్వహణకు శాఖల మధ్య సమన్వయం
- సింగిల్ యూజ్ ప్లాస్టిక్, డీజేల వినియోగంపై నిషేధం
- పర్యావరణహితంగా మట్టి విగ్రహాలను ప్రోత్సహించాలి
- హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పరిధిలో పటిష్ఠ బందోబస్తు
- 24 గంటలూ పారిశుద్ధ్యం, వైద్య సేవలు అందుబాటులో ఉంచాలి
- నిమజ్జన ప్రాంతాల్లో గజ ఈతగాళ్లు, లైఫ్‌బోట్లు సిద్ధం
- ఫిట్‌నెస్ ఉన్న ఆర్టీసీ బస్సులనే వినియోగించాలి
- మెట్రో సర్వీసుల వేళలు, ఫ్రీక్వెన్సీ పెంపు
- అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలి

-సిటీబ్యూరో

రాష్ట్రంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులూ సమన్వయంతో పనిచేయాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలన ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని గణేష్ మండపాలకూ ఉచిత విద్యుత్ సరఫరా చేస్తుందని, మండపాల నిర్వాహకులు నిర్దేశిత విధానంలో దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాల్లో గణేష్ ఉత్సవాల ఏర్పాట్లపై హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ ఎంసీఆర్ హెచ్ఆర్డీ ఇన్‌స్టిట్యూట్‌లో మంగళ వారం ఉన్నతస్థాయి సన్నాహక సమన్వయ సమావేశం జరిగింది.



02

## ఉక్రెయిన్‌పై రష్యా

# భీకర దాడి..

- డ్రోన్లు, మిస్సైళ్లతో విరుచుకుపడిన రష్యా
- 12 మంది మృతి.. మృతుల్లో ఒక భారతీయుడు
- కీవ్, ఒడెశాపై భారీగా దాడులు
- 200 వరకు డ్రోన్లు, మిస్సైళ్లతో విరుచుకుపడిన రష్యా
- 28 ప్రాంతాలను లక్ష్యంగా చేసుకున్న దాడులు
- జనావాసాల్లో ధ్వంసమైన ఇళ్లు, అపార్ట్‌మెంట్లు
- క్షతగాత్రుల్లో చిన్నారులు కూడా
- విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం
- ఉక్రెయిన్‌కు ఆర్థిక సాయం అందించేందుకు ఈయూ సిద్ధం

# హైడ్రా కమిషనర్‌కు హైకోర్టులో ఊరట



- రంగనాథ్‌ను తప్పించాలన్న గత ఆదేశాలపై స్టే
- 119 ఎకరాల ప్రభుత్వ భూముల వ్యవహారంలో కీలక పరిణామం
- డివిజన్ బెంచ్ ముందు హైడ్రా కమిషనర్ అప్పీల్
- రంగనాథ్ తరఫున సీనియర్ న్యాయవాది రాజీవ్ శక్ధర్ వాదనలు
- తదుపరి విచారణ నవంబర్ 3కు వాయిదా
- ప్రభుత్వ భూముల పరిరక్షణపై కొనసాగుతున్న న్యాయపోరాటం

సిటీబ్యూరో

సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతంలో జీఎల్ ఆర్ 243లో రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన భూముల పరిరక్షణ విషయంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హైకోర్టులో భారీ ఊరట లభించింది. గతంలో ఈ కేసు విచారణలో భాగంగా హైడ్రా కమిషనర్ ను తప్పించాలంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును హైకోర్టు డివిజన్ బెంచ్ మంగళవారం నిలిపివేసింది. సింగిల్ జడ్జి ఇచ్చిన -మిగతా 2 లో




# కన్నీటిలో నేపాల్..

విధ్వంసం నుంచి ఇంకా కోలుకోని నేపాల్

- వెయ్యి దాటిన మృతుల సంఖ్య
- గల్లంతైన వారు 4వేలకు పైమాటే..
- వేలాది మంది ఆచూకీ కోసం ఎదురుచూపులు
- శిథిలాల కిందే వేలాది ప్రాణాలు..
- కొనసాగుతున్న రెస్క్యూ ఆపరేషన్

02

హిమాలయాల్లో విరుచుకుపడిన వరదలు నేపాల్‌ను శోకసంద్రంలో ముంచేశాయి. దేశంలో మృతుల సంఖ్య 987కు చేరగా, చైనాలో మరో 16 మంది ప్రాణాలు కోల్పోవడంతో ఈ విపత్తు బలుల సంఖ్య వెయ్యి దాటింది. నాలుగు వేల మందికిపైగా గల్లంతవడంతో వేలాది కుటుంబాలు ఆందోళనలో ఉన్నాయి. ఏడో రోజైనా సహాయక చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. శిథిలాలు, మట్టి, నీటితో నిండిపోయిన ప్రాంతాల్లో వేలాది మంది సిబ్బంది గాలింపు చేపడుతున్నారు. ముఖ్యంగా హైడ్రోపవర్ ప్రాజెక్టుల వద్ద వందలాది మంది కార్మికులు చిక్కుకుపోయి ఉండవచ్చన్న అంచనాలు ఆందోళన కలిగిస్తున్నాయి. వాతావరణ మార్పుల ప్రభావానికి ఈ విపత్తు మరో హెచ్చరికగా మారగా, గల్లంతైన వారి ఆచూకీ కోసం నేపాల్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా వేలాది కుటుంబాలు ఎదురుచూస్తున్నాయి.



02

# మళ్లీ గ్యాస్ మంటలు

- కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలు పెంపు
- 19 కేజీల సిలిండర్‌పై రూ.9.50 పెరుగుదల
- 14.2 కేజీల గృహ వినియోగ సిలిండర్ ధరలో మార్పు లేదు
- సెప్టెంబర్ 1 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త ధరలు

## వేటు ఎవరిపై..

# సీటు ఎవరికి?

కొండా సురేఖపై వీడని ఉత్కంఠ


- హస్తినకు మారిన రాష్ట్ర రాజకీయం
- కెసి వేణుగోపాల్‌తో గంటకు పైగా సిఎం రేవంత్‌రెడ్డి మంతనాలు
- అధిష్టానం ఆదేశంతో ఢిల్లీకి చేరుకున్న మంత్రి కొండా సురేఖ
- కొండా, చిన్నారెడ్డి ఉద్వాసనపై ఊహాగానాలు
- నామినేటెడ్ పోస్టుల భర్తీ, మంత్రివర్గం పునర్వ్యవస్థీకరణపైనా చర్చ
- నేడు సిఎం, పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌తో చర్చించనున్న కెసి

/హైదరాబాద్

రాష్ట్ర మంత్రి కొండా సురేఖ చిచ్చు, తదనంతరం కాంగ్రెస్‌లో నెలకొన్న రాజకీయం అనూహ్యంగా ఢిల్లీకి చేరింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్‌తో మంగళవారం సాయంత్రం గంటకుపైగా చర్చించారు. మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డితో కలిగిన తలనొప్పి, రాష్ట్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ఆవశ్యకత, నామినేటెడ్ పోస్టులతో చర్చించారని సమాచారం. మంత్రి కొండా సురేఖ వివాదం కొత్తదేమీ కాదని గతంలోనూ రెండు పర్యాయాలు తలనొప్పి తెచ్చి పెట్టారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఆయనకు చెప్పినట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది.

-మిగతా 2 లో






## స్వదేశీ నినాదంతో

# ముందుకు సాగండి

- బంగారాన్ని అనవసరంగా కొనకండి
- డెస్టినేషన్ పేరుతో విదేశాల్లో పెళ్లిళ్లకు దూరం కండి
- దేశప్రజల సమిష్టి కృషితోనే జిడిపి వృద్ధిరేటు
- దేశ జీడీపీ 7.8 శాతం మేర వృద్ధి సాధించడం గర్వకారణం
- ఇన్‌స్టా వేదికగా ప్రధాని మోడీ దేశ ప్రజలకు అభినందనలు

న్యూఢిల్లీ,

భారత్ సాధించిన వృద్ధి రేటు దేశ సమష్టి శక్తికి నిదర్శనమని భారత ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. నిరాశావాదులు మాత్రం తమ అసత్యాలను వ్యాప్తి చేస్తూనే ఉన్నారని విమర్శించారు. యుద్ధాలు, సరఫరా వ్యవస్థల్లో అడ్డంకుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా గడ్డు పరిస్థితులు నెలకొన్నప్పటికీ భారత్ మెరుగైన వృద్ధి రేటు సాధించిందని చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారత దేశ జీడీపీ ఏకంగా 7.8 శాతం మేర వృద్ధి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ప్రధాని -మిగతా 2 లో



02

## మా జీవనాధారాన్ని

# భారత్ ఆపేసింది..

- సింధు జలాల నిలిపివేతపై పాక్ ఆగ్రహం
- సింధు జలాల ఒప్పందంపై ముదురుతున్న వివాదం
- అంతర్జాతీయ వేదికలపై పాక్ గగ్గోలు
- నీటిని ఆయుధంగా వాడొద్దన్న షాబాజ్ షరీఫ్
- హేగ్ కోర్టు నిర్ణయాన్ని తిరస్కరించిన భారత్
- ఒప్పందాన్ని నిలిపివేసే నిర్ణయం కొనసాగుతుందన్న భారత
- ఇరు దేశాల మధ్య మరింత పెరగనున్న దౌత్య ఉద్రిక్తతలు

# మళ్లీ గ్యాస్ మంటలు

**- కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలు పెంపు**
**- 19 కేజీల సిలిండర్‌పై రూ.9.50 పెరుగుదల**
**-- 14.2 కేజీల గృహ వినియోగ సిలిండర్ ధరలో మార్పు లేదు**
**- సెప్టెంబర్ 1 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త ధరలు**



న్యూఢిల్లీ

నెల ప్రారంభంలోనే ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు 19 కేజీల కమర్షియల్ గ్యాస్ సిలిండర్‌పై రూ.9.50 చొప్పున ధర పెంచాయి. దీంతో రెస్టారెంట్లు, హోటళ్లు, దాబాలు, బేకరీలు, స్వీట్ షాపులు, ఇతర వాణిజ్య సంస్థలపై ఇంధన వ్యయం కొంత మేర పెరగనుంది. కొత్త ధరల ప్రకారం.. ఢిల్లీలో 19 కేజీల వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధర రూ.2,738 నుంచి రూ.2,747.50కి పెరిగింది. చెన్నైలో రూ.2,906గా ఉన్న ధర తాజాగా రూ.2,916.50కి చేరింది. ఇతర నగరాల్లో స్థానిక పన్నులు, ఇతర ఛార్జీల ఆధారంగా ధరల్లో స్వల్ప వ్యత్యాసాలు ఉండొచ్చని చెబుతున్నారు. కమర్షియల్ ఎల్పీజీ ధరలు పెరిగినప్పటికీ.. సాధారణ గృహ వినియోగదారులకు మాత్రం ఊరట లభించింది. 14.2 కేజీల డొమెస్టిక్ ఎల్పీజీ సిలిండర్ ధరలో సెప్టెంబర్ 1 నుంచి ఎలాంటి మార్పు లేదు. తాజా ధర పెరుగుదల కేవలం వాణిజ్య సిలిండర్లకే వర్తిస్తుంది. దీంతో ఇంట్లో వంట కోసం గ్యాస్ ఉపయోగించే వినియోగదారులపై తక్షణంగా అదనపు భారం పడలేదు.

వ్యాపారాలపై ఎంత ప్రభావం ఎంతంటే..

ఒక్కో సిలిండర్‌పై రూ.9.50 పెంపు పెద్ద మొత్తంగా కనిపించకపోయినా.. రోజుకు పలు సిలిండర్లు వాడే వ్యాపార సంస్థలకు నెలవారీగా అదనపు ఖర్చు పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా రెస్టారెంట్లు, హోటళ్లు, దాబాలు, బేకరీలు, స్వీట్ షాపులు వంటి సంస్థలు కమర్షియల్ ఎల్పీజీపై ఎక్కువగా ఆధారపడతాయి. ఇంధన ఖర్చులు పెరిగితే భవిష్యత్తులో ఆహారం, ఇతర సేవల ధరలపై కూడా కొంత ప్రభావం పడే అవకాశం ఉంది. నిజానికి 2026లో వాణిజ్య ఎల్పీజీ ధరల్లో పలుమార్లు ధరల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. ఆగస్టులో కమర్షియల్ సిలిండర్ ధరలు గణనీయంగా తగ్గగా.. అంతకుముందు జులైలోనూ ధర తగ్గింపు నమోదైంది. ఈ నేపథ్యంలో సెప్టెంబర్‌లో తాజాగా రూ.9.50 పెంపు జరిగింది. గత తగ్గింపులతో పోలిస్తే ఈసారి పెరుగుదల స్వల్పంగానే ఉన్నప్పటికీ.. వాణిజ్య వినియోగదారులపై అదనపు వ్యయభారం పడనుంది. ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు సాధారణంగా ప్రతి నెలా ఒకటో తేదీన ఎల్పీజీ ధరలను సమీక్షిస్తుంటాయి. అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు, విదేశీ మార్పిడి విలువ, ఇతర వ్యయాలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ధరల్లో మార్పులు చేస్తాయి. అందుకే సిలిండర్ బుక్ చేసుకునే ముందు తమ నగరానికి వర్తించే తాజా ధరను వినియోగదారులు, వ్యాపార సంస్థలు పరిశీలించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. మొత్తంగా సెప్టెంబర్ 1 నుంచి కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ ధరలు స్వల్పంగా పెరగ్గా.. గృహ వినియోగ ఎల్పీజీ ధరల్లో మాత్రం ఎలాంటి మార్పు లేకపోవడం సాధారణ వినియోగదారులకు ఊరటనిచ్చింది.

## స్వదేశీ నినాదంతో ముందుకు సాగండి

మొదటి తరువాయి

మోదీ దేశ ప్రజలకు అభినందనలు చెప్పారు. 7.8 శాతం వృద్ధి రేటు నమోదవడంతో దేశవ్యాప్తంగా హర్షం వ్యక్తమవుతోందని అన్నారు. దేశ ప్రజల పట్టుదల, శక్తిసామర్థ్యాలు గొప్పవని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా గడ్డు పరిస్థితులు నెలకొన్నా భారత్ వృద్ధి పథంలో దూసుకుపోతోందని అన్నారు. భారత దేశ ప్రగతిని ఇలాగే కొనసాగించాల్సిన అవసరం ఉందని కూడా ప్రధాని చెప్పారు. ఆత్మనిర్భరత సాధించడం అవసరమని మరోసారి చెప్పారు. స్వదేశీ వస్తువులకు దేశ ప్రజలు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనవసర విదేశీ పర్యటనలు, బంగారం కొనుగోళు వద్దని అన్నారు. విదేశీ మారకనిల్వల పొదుపు కోసం భారత్‌లోనే వివాహాది శుభకార్యాలు జరుపుకోవాలని సూచరించారు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు అభినందనలు తెలిపిన ఆయన.. గతంలో చేసిన విజ్ఞప్తినే మరోసారి గుర్తుచేశారు. స్వదేశీ వస్తువులనే కొనుగోలు చేయాలని, విదేశీ ప్రయాణాలు వద్దని, అవసరం లేకుండా బంగారం కొనొద్దని మరోసారి కోరారు. ప్రస్తుతం కిర్గిస్థాన్ పర్యటనలో ఉన్న ఆయన ఈ మేరకు ఇన్‌స్టా వీడియో విడుదల చేశారు. దేశ ప్రజలకు అభినందనలు. 7.8? వృద్ధి గొప్ప విషయం. ప్రజల సంకల్ప బలం, కృషికి ఇది నిదర్శనం. ప్రపంచం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో భారత్ ఈ అసాధారణ ఘనతను దక్కించుకుంది. ప్రపంచం యుద్ధంలో మునిగిపోయింది. ఎటుచూసినా యుద్ధ వార్తలే.. సంక్షోభాలే. సరఫరా గొలుసు పూర్తిగా దెబ్బతింది. 2020లో కొవిడ్ తర్వాత నుంచి నేటి వరకు ఎక్కడా స్థిరత్వం కనిపించడం లేదు. అయినా భారత్ పురోగమిస్తోందని మోదీ తన వీడియోలో పేర్కొన్నారు. పర్యటనల కోసం విదేశాలకు వెళ్లొద్దు. విదేశాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు దూరంగా ఉండండి. 'భారత్‌లోనే వివాహం చేసుకోండి' అనే మంత్రాన్నే మనం పాటిద్దాం. అవసరం లేకపోతే బంగారాన్ని కొనడం మానుకోండి. స్థానికంగా తయారైన వస్తువులు, సేవలు ఎంత ఎక్కువగా ఎంచుకుంటే.. దేశం అంత ఎక్కువగా అభివృద్ధి చెందుతుంది. మనం స్వావలంబనకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ఉంటే.. స్వాతంత్య్రం వచ్చి 100 ఏళ్లు పూర్తయ్యేనాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదుగుతామనే విశ్వాసం నాకు ఉందని మోదీ పేర్కొన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అంచనా వేసిన 7 శాతం కంటే ప్రస్తుత వృద్ధి రేటు ఎక్కువ. అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయంగా అనిశ్చితులు, ఇంధన సరఫరాకు అవరోధాలు వంటి పరిస్థితులను తట్టుకొని భారత ఆర్థిక వ్యవస్థ రాణించడం విశేషం. ఈ వృద్ధిని దేశ ప్రజలు వేడుకలా నిర్వహించుకోవాలి. అదే సమయంలో వికసిత్ భారత్ దిశగా కృషి చేయాలి. 140 కోట్ల మంది ప్రజల ఐక్యత.. దేశాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్తుందని ప్రధాని అన్నారు.

## మా జీవనాధారాన్ని భారత్ ఆపేసింది..

**-సింధు జలాల నిలిపివేతపై పాక్ ఆగ్రహం**
**-సింధు జలాల ఒప్పందంపై ముదురుతున్న వివాదం**
**-అంతర్జాతీయ వేదికలపై పాక్ గగ్గోలు**
**-నీటిని ఆయుధంగా వాడొద్దన్న షాబాజ్ షరీఫ్**
**-హేగ్ కోర్టు నిర్ణయాన్ని తిరస్కరించిన భారత్**
**-ఒప్పందాన్ని నిలిపివేసే నిర్ణయం కొనసాగుతుందన్న భారత్**
**-ఇరు దేశాల మధ్య మరింత పెరగనున్న దౌత్య ఉద్రిక్తతలు**



షాంఘై

భారత్--పాకిస్తాన్ మధ్య సింధు జలాల ఒప్పందంపై వివాదం మరింత ముదురుతోంది. సింధు జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేయడంపై పాకిస్తాన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. ఈ అంశాన్ని అంతర్జాతీయ వేదికలపై పదేపదే ప్రస్తావిస్తున్న పాకిస్తాన్.. తాజాగా షాంఘై సహకార సంస్థ సదస్సులోనూ లేవనెత్తింది.

2026-27 సంవత్సరానికి ఎస్ సి ఓ అధ్యక్ష పదవిని పాకిస్తాన్ చేపట్టిన నేపథ్యంలో బిష్కెక్ లో జరిగిన ఎస్ సి ఓ దేశాధినేతల మండలి శిఖరాగ్ర సమావేశంలో పాకిస్తాన్ ప్రధాని షాబాజ్ షరీఫ్ మాట్లాడారు. నీరు ఈ ప్రాంతానికి జీవనాధారమని పేర్కొంటూ, దానిని ఎప్పుడూ ఆయుధంగా, ఒత్తిడి సాధనంగా లేదా రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించకూడదని అన్నారు. ఉమ్మడి జల వనరులకు సంబంధించిన ఒప్పందాలు అంతర్జాతీయంగా కట్టుబడి ఉండే బాధ్యతలని షాబాజ్ షరీఫ్ పేర్కొన్నారు. అలాంటి ఒప్పందాలను ఎలాంటి షరతులు లేకుండా తప్పనిసరిగా పాటించాల్సిన అవసరం ఉందని అన్నారు. అయితే, పాకిస్తాన్ ఎదుర్కొంటున్న ఉగ్రవాద సమస్య, దానిపై తీసుకోవాల్సిన చర్యల గురించి ఆయన తన ప్రసంగంలో ప్రస్తావించలేదు.

హేగ్ కోర్టు తీర్పు.. భారత్ తిరస్కరణసింధు జలాల ఒప్పందంపై ఆగస్టు 31న హేగ్ లోని కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ కీలక నిర్ణయం వెలువరించింది. 1960లో కుదిరిన సింధు జలాల ఒప్పందం అమల్లోనే ఉందని, భారత్ దాని బాధ్యతలను కొనసాగించాలని కోర్టు పేర్కొంది. అలాగే జమ్మూకాశ్మీర్ లోని రాట్లే జలవిద్యుత్ ప్రాజెక్టుకు సంబంధించి కొన్ని నిర్మాణ పనులను పరిమితం చేయాలని మధ్యంతర ఆదేశాలు ఇచ్చింది. అయితే ఈ తీర్పును భారత్ తీవ్రంగా తిరస్కరించింది. హేగ్ లోని ఈ కోర్టును తాము గుర్తించలేదని, అది చట్టవిరుద్ధంగా ఏర్పాటు చేయబడిందని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. భారత సార్వభౌమ నిర్ణయాలపై తీర్పు ఇచ్చే అధికారం ఆ కోర్టుకు లేదని పేర్కొంది. సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేస్తూ భారత్ తీసుకున్న నిర్ణయం యథాతథంగా కొనసాగుతుందని స్పష్టం చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో పాకిస్తాన్ అంతర్జాతీయ వేదికలపై సింధు జలాల అంశాన్ని మరింత బలంగా ప్రస్తావిస్తోంది. మరోవైపు, భారత్ మాత్రం హేగ్ కోర్టు ఆదేశాలను అంగీకరించేది లేదని తేల్చి చెప్పింది. దీంతో సింధు జలాల ఒప్పందంపై ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది.

# కన్నీటిలో నేపాల్..

**-- వెయ్యి దాటిన మృతుల సంఖ్య**
**-- గల్లంతైన వారు 4వేలకు పైమాటే..**
**-- వేలాది మంది ఆచూకీ కోసం ఎదురుచూపులు**
**-- శిథిలాల కిందే వేలాది ప్రాణాలు..**
**-- కొనసాగుతున్న రెస్క్యూ ఆపరేషన్**



**ఖాట్మండు:**

నేపాల్‌లో సంభవించిన ఆకస్మిక వరద తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఈ జలప్రళయంలో మృతుల సంఖ్య 987కు చేరింది. చైనాలో మరో 16 మంది మరణించినట్లు సమాచారం. రెండు దేశాల్లో కలిపి మృతుల సంఖ్య 1,000 దాటింది. 4 వేలకు పైగా మంది ఇంకా కనిపించడం లేదని అధికారులు వెల్లడించారు. విపత్తు సంభవించి ఏడో రోజుకు చేరుకున్నప్పటికీ సహాయక, గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. తాత్కాలిక వంతెనలను నిర్మిస్తూ బాధిత్ ప్రాంతాలకు చేరుకునేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటివరకు 11,000 మందికి పైగా ప్రజలను రక్షించినట్లు సమాచారం. నేపాల్, భారత్, చైనా బృందాలకు చెందిన వేలాది మంది సిబ్బంది హెలికాప్టర్లు, డ్రోన్లు, భారీ యంత్రాలను ఉపయోగిస్తూ సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. వరదల్లో తీవ్రంగా దెబ్బతిన్న హైడ్రోపవర్ ప్రాజెక్టులు ప్రస్తుతం రెస్క్యూ చర్యలకు ప్రధాన కేంద్రాలుగా మారాయి.

దాదాపు 900 మంది హైడ్రోపవర్ కార్మికులు గల్లంతయ్యారని, వారిలో సుమారు 500 మంది సొరంగాల్లో చిక్కుకుని ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. సొరంగాల్లోకి మట్టి, రాళ్లు, నీరు భారీగా చేరడంతో లోపలికి వెళ్లి గాలింపు చేపట్టడం అత్యంత ప్రమాదకరంగా మారింది. డ్రోన్లను ఉపయోగించి బాధితులను గుర్తించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే సొరంగాలు మలుపులు, మట్టి, శిథిలాలతో నిండిపోవడంతో డ్రోన్లను లోపలికి పంపడం కూడా సాధ్యపడటం లేదు. కొందరు కార్మికులతో తొలుత సంబంధాలు ఏర్పడినప్పటికీ, ఆ తర్వాత వారి పరిస్థితిపై స్పష్టమైన సమాచారం లభించలేదని నివేదికలు చెబుతున్నాయి.

భారత సైన్యానికి చెందిన సాంకేతిక బృందాలు నేపాల్ సైన్యంతో కలిసి చిలోమే, లాంగ్‌టాంగ్ ప్రాంతాల్లోని సొరంగాల్లో గాలింపు చేపట్టాయి. హిమాలయ ప్రాంతంలో వాతావరణ మార్పుల ప్రభావాన్ని అంతర్జాతీయ సమాజం తీవ్రంగా పరిగణించాల్సిన అవసరాన్ని నేపాల్ ప్రధానమంత్రి బాలేంద్ర షా ప్రస్తావించారు. గల్లంతైన వారిలో విదేశీయులు కూడా పెద్ద సంఖ్యలో ఉన్నారు. నేపాల్ అధికారుల లెక్కల ప్రకారం గల్లంతైన వారిలో 583 మంది విదేశీయులు ఉన్నారు. తమ కుటుంబ సభ్యుల ఆచూకీ కోసం విదేశీ పౌరుల బంధువులు నేపాల్ అధికారులను సంప్రదిస్తున్నారు. మృతదేహాలను గుర్తించేందుకు డీఎన్ఏ నమూనాలు, ఫోటోలు వంటి వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. వరదల్లో గల్లంతైన ఓ అమెరికా పౌరుడిని అధికారులు తాజాగా సంప్రదించగలిగారు. వరదల ప్రభావం నేపాల్ హైడ్రోపవర్ రంగాన్ని తీవ్రంగా పడింది. పలు విద్యుత్ కేంద్రాలు, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు దెబ్బతినడంతో దేశ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంలో గణనీయమైన భాగం ప్రభావితమైంది. కొన్ని విద్యుత్ ఎగుమతులను నిలిపివేసి భారత్ నుండి విద్యుత్ దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# వేటు ఎవరిపై.. సీటు ఎవరికి?

మొదటి తరువాయి

పైగా జిల్లాలోనూ ఏ ఒక్క ఎమ్మెల్యేతోనూ, పార్టీ నాయకులతోనూ సఖ్యతతో ఉండడం లేదని, ఉమ్మడి వరంగల్ జిల్లా మొత్తం తన...

వేటు ఎవరికో..సీటు ఎవరికో?

కొండా దంపతులు ప్ర వర్తిస్తారని, ఇప్పుడు తాజాగా కుమార్తె కూడా జతకలిసారని ముఖ్యమంత్రి అన్నట్లు తెలిసింది. ఈ కీలకమైన అంశాలపై బుధవారం ఉదయం పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌తో, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్‌తో, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో చర్చిద్దామని కెసి వేణుగోపాల్ ముఖ్యమంత్రితో అన్నట్లు తెలిసింది. ఈ సమావేశంలో పాల్గొనేందుకు ఉప ముఖ్యమం త్రి భట్టి విక్రమార్క బుధవారం ఢిల్లీ బయలుదేరి వెళ్ళనున్నారు. ఇదిలా ఉండగా పార్టీ అధిష్టానం ఆదేశం మేరకు మంత్రి కొండా సురేఖ మంగళవారం ఢిల్లీకి చేరుకున్నారు. ఆమె వెళ్లిన విమానంలోనే అనుకోకుండా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉన్నారు. మంగళవారం రాత్రి గంటలకు కెసి వేణుగోపాల్‌తో కొండా సురేఖ భేటీ కావాల్సి ఉండగా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కెసి చర్చలు జరపడం, ఇంకా ఇతర షెడ్యూలుతో ఆయన బిజీగా ఉండడం వల్ల బుధవారం మధ్యాహ్నం కలవాలని ఆమెకు సమాచారం చేరవేసినట్లు తెలిసింది. నిజానికి కెసి వేణుగోపాల్‌కు అంతగా బిజీ షెడ్యూలు ఏమీ లేనప్పటికీ, బుధవారం మీనాక్షి నటరాజన్, మహేష్‌కుమార్ గౌడ్‌తో చర్చించిన తర్వాతే ఆమెకు అపాయింట్‌మెంట్ ఇవ్వాలని భావించినట్లు పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. దూకుడు తగ్గించాలని మంత్రి కొండా సురేఖకు పార్టీ అధిష్టానం నచ్చజెబుతుందా? లేక మంత్రి పదవికి రాజీనామా చేయిస్తారా?, ఆమె చేయనంటే ఉద్వాసన చెబుతూ గవర్నర్‌కు లేఖ పంపిస్తారా? వంటి ఊహాగానాలు కొనసాగుతున్నాయి. అయితే కొండా సురేఖ మాత్రం తనకేమీ కాదన్న ధీమాతో కనిపించారు. తన కుమార్తె చేసిన తప్పిదంతో తనకేమీ సంబంధం లేదన్న వాదనతోనే ఉన్నారు. కొండా సురేఖ, చిన్నారెడ్డి వివాదంపైనా కెసి వేణుగోపాల్ బుధవారం చర్చించనున్నారు. కాగా కొండా సురేఖ మాత్రం ఢిల్లీలో లాబీయింగ్‌కు సిద్ధపడ్డారు. ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేను, ఎఐసిసి ఇతర పెద్దలను కలిసి తన గోడు వినిపించుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారని తెలిసింది.

జోరుగా పలువురి లాబీయింగ్

త్వరలో మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణ జరుగుతుందన్న ప్రచారం నేపథ్యంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ విజయశాంతి ఢిల్లీకి చేరుకుని పార్టీ పెద్దలను కలుసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. స్పీకర్ ప్రసాద్ కుమార్ ఇటీవల ఢిల్లీలో పార్టీ ముఖ్యులను కలిసి మంత్రివర్గంలో చోటు కల్పించాలని కోరారని తెలిసింది. ఇక విజయశాంతి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాత్రం తమ ఇరువురికీ ఎన్నికల ముందు పార్టీ అధికారంలోకి రాగానే మంత్రివర్గంలో స్థానం కల్పిస్తామన్న హామీ ఇచ్చారని చెబుతున్నారు. అసెంబ్లీ సమావేశాల తర్వాతే పునర్ వ్యవస్థీకరించవచ్చని, ఈలోగా కొండా సురేఖ వివాదానికి తెర పడాలని ముఖ్యమంత్రి భావిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతున్నది.

42 నామినేటెడ్ పదవులపైనా నేడు చర్చ

రాష్ట్రంలోని వివిధ కార్పొరేషన్ల పదవులపైనా బుధవారం పార్టీ అధిష్టానంతో సిఎం, పిసిసి చీఫ్, ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, భట్టి విక్రమార్క చర్చించనున్నారు. సుమారు 42 కార్పొరేషన్ల నామినేటెడ్ పదవులపై చర్చించి అధిష్టానం నుంచి అనుమతి పొందే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇకపోతే ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఇంకా గడువు ఉంది కాబట్టి అభ్యర్థుల ఎంపిక అంశం తర్వాత చర్చించవచ్చని తెలిసింది.

## గణేష్ ఉత్సవాలు సజావుగా నిర్వహించాలి

మొదటి తరువాయి

ఈ సందర్భంగా మంత్రి వివిధ శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఉత్సవాలను పర్యావరణహితంగా నిర్వహిం చాలని, మట్టి విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహిం చాలని సూచిం చారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్, డీజేల వినియోగాన్ని పూర్తిగా నిషేధించినట్టు స్పష్టం చేశారు.

పటిష్ట భద్రత -- ట్రాఫిక్ నియంత్రణ

హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. షీ టీమ్స్, యాంటీ-థెఫ్ట్ బృందాలతో నిరంతర నిఘా ఉంచాలని, శాంతిభద్రతలు, మత సామరస్యాన్ని కాపాడాలని మంత్రి చెప్పారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు, పార్కింగ్ స్థలాలు, ట్రాఫిక్ వాలంటీర్లను సిద్ధం చేయాలని సూచించారు. జీహెచ్ఎంసీ, మున్సిపల్ అధికారులు 24 గంటలపాటు పారిశుధ్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, రోడ్డు మరమ్మతులు, వీధి దీపాల నిర్వహణ, ఫాగింగ్, బయో టాయిలెట్లు, బేబీ పాండ్ల నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని అన్నారు. కీలక ప్రాంతాల్లో 24 గంటల వైద్య శిబిరాలు, అంబులెన్సులు, డాక్టర్లు, మందులతో కూడిన వైద్య బృందాలను సిద్ధంగా ఉంచాలని వైద్య శాఖను ఆదేశించారు. నిమజ్జన ప్రాంతాల్లో శిక్షణ పొందిన గజ ఈతగాళ్లు, ఫైర్ సిబ్బంది, టూరిజం శాఖ లైఫ్‌బోట్లను సిద్ధంగా ఉంచాలని చెప్పారు.

## హైడ్రా కమిషనర్‌కు హైకోర్టులో ఊరట

మొదటి తరువాయి

తీర్పుపై హైడ్రా కమిషనర్ డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేసిన విషయం విదితమే. ఈ కేసు మంగళవారం విచారణకు వచ్చింది. హైడ్రా కమిషనర్ తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది, హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ రాజీవ్ శక్దర్ సుదీర్ఘ వాదనలు వినిపించారు. అనంతరం డివిజన్ బెంచ్ గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సస్పెండ్ చేసింది. తదుపరి విచారణను నవంబరు 3కు వాయిదా వేసింది.

కేసు పూర్వాపరాలు..

సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని జీఎల్ ఆర్ 243లో 119 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. బీ-2 భూములుగా పేర్కొన్న వీటిని ఆస్పత్రులు, పాఠశాలలు.. ఇలా రాష్ట్ర ప్రభుత్వ అవసరాల నిమిత్తం సికింద్రాబాద్ కంటోన్మెంట్ కేటాయించింది. వీటి హక్కుదారుగా రాష్ట్ర ప్రభుత్వం ఉండటమే కాకుండా, వాటి సంరక్షణ బాధ్యతలు కూడా తీసుకుంటుంది. జులై 18న తిరుమలగిరి -- అల్వాల్ ప్రాంతంలోని ఈ 119 ఎకరాల ప్రభుత్వ భూమికి హైడ్రా ఫెన్సింగ్ వేసింది. ఇది ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ డిఫెన్స్ ఎస్టేట్ అధికారులు కూడా ధ్రువీకరించారు. ఇందుకు సంబంధించిన కో ఆర్డినేట్స్, గూగుల్ ఎర్త్‌మీద క్లియర్‌గా మార్కు చేస్తూ కేఎంఎల్ ఫైల్ ఇచ్చారు.

3 కిలోమీటర్ల దూరం..

మేడ్చల్ -- మల్కాజిగిరి జిల్లా అల్వాల్ మండలం లోతుకుంట సర్వే నంబరు 1, 2లో ఉన్న ప్రయివేటు భూములకు, 243 జీ ఎల్ ఆర్ నెంబరులో ఉన్న 119 ఎకరాల ప్రభుత్వ భూమికి మధ్య దూరం 3 కిలోమీటర్ల వరకూ ఉందని హైడ్రా చెబుతూ వస్తోంది. లోతుకుంట సర్వే నంబరు 1, 2 లో అనుమతులు తెచ్చుకుని జీఎల్ ఆర్ నెంబర్ 243లోని ప్రభుత్వ భూమిలో శాంతశ్రీరాం కనస్ట్రక్షన్స్ నిర్మాణాలు చేపడుతోంది. ప్రభుత్వ భూమిని తమదిగా చెబుతూ హైకోర్టును ఆశ్రయించడమే కాకుండా కంటెంప్ట్ కేసు కూడా హైడ్రాపై వేసింది. వ్యక్తిగతంగా హైడ్రా కమిషనర్‌పై కూడా కంటెంప్ట్ కేసు వేసింది. ఈ కేసు విచారణలో హైకోర్టు సింగిల్ జడ్జి పలు వ్యాఖ్యలు చేయడమే కాకుండా.. హైడ్రా కమిషనర్ పోస్టు నుంచి ఏవీ రంగనాథ్ ను తప్పించి, ఆ స్థానంలో మరొకరిని నిమించాలంటూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం ఈ ఆదేశాలను హైకోర్టు డివిజన్ బెంచ్ సస్పెండ్ చేసింది.

## నీట్ నిరసనల కేసులు కొట్టివేత

మొదటి తరువాయి


సమయంలో తీవ్రమైన నేరాలకు పాల్పడిన వారిపై విచారణ మాత్రం కొనసాగాలని స్పష్టం చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) సూర్యకాంత్, జస్టిస్ జాయ్ మాల్యాబాగ్చీ, జస్టిస్ వి మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కీలక తీర్పును వెలువరించింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద ఉన్న ప్రత్యేక అధికారాలను వినియోగించిన సుప్రీంకోర్టు.. విద్యార్థుల భవిష్యత్తును ఒక్క ఎఫ్ఐఆర్ ఆధారంగా దెబ్బతీయకూడదని అభిప్రాయపడింది. ప్రజాస్వామ్యంలో శాంతియుత నిరసన వ్యక్తీకరణ హక్కు ఒక రాజ్యాంగబద్ధమైన హక్కు అని, నిరసనల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరినీ నేరస్థులుగా చూడడం సరైన విధానం కాదని కోర్టు పేర్కొంది. అయితే ఈ ఉపశమనం అందరికీ వర్తించదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఇప్పటికే హత్య, అత్యాచారం, హింసాత్మక దాడులు, ఆస్తుల ధ్వంసం వంటి తీవ్రమైన కేసుల్లో నేరచరిత్ర ఉన్నవారు, నిరసనల సందర్భంగా అలాంటి నేరాలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం విచారణ కొనసాగాలని ఆదేశించింది. అలాంటి వ్యక్తులపై ప్రత్యేక ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టేందుకు అనుమతి ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం కూడా సుప్రీంకోర్టులో విద్యార్థులపై నమోదైన కేసులను కొనసాగించే ఉద్దేశం లేదని తెలిపింది. అయితే తీవ్రమైన నేరచరిత్ర ఉన్నవారిపై మినహాయింపు ఉండాలని కోరగా, సుప్రీంకోర్టు కూడా అదే దిశగా నిర్ణయం తీసుకుంది. ఈ తీర్పు విద్యార్థులకు లభించిన ముఖ్యమైన న్యాయ విజయమని నీట్ ఉద్యమానికి మద్దతు తెలిపిన సంస్థలు పేర్కొన్నాయి.

5న నిరసనలు విరమణ : సీజేపీ

నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై ఈ నెల 5వ తేదీన ఢిల్లీలో నిర్వహించాలని ప్రకటించిన నిరసన ర్యాలీని విరమించుకుంటున్నట్లు సీజేపీ ప్రకటించింది. సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు, కోర్టు జారీ చేసిన తాజా ఆదేశాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ సహ-కన్వీనర్ సౌరవ్ దాస్ ధర్మాసనానికి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కోర్టుకు ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేస్తుందని ఆశిస్తున్నామని, అమలు ప్రక్రియను నిశితంగా గమనిస్తామని సంస్థ పేర్కొంది. వాస్తవానికి ఉపాధ్యాయ దినోత్సవమైన సెప్టెంబర్ 5న ఇండియా గేట్ నుంచి ఢిల్లీ పోలీసు ప్రధాన కార్యాలయం వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించాలని సీజేపీ ముందుగా ప్రకటించింది. నీట్ పరీక్ష రద్దు తర్వాత ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థుల కుటుంబాలు, జులై నెలలో జరిగిన నిరసనల్లో పోలీసుల చర్యలకు గురైన వారు ఈ ర్యాలీలో పాల్గొనాల్సి ఉందని సంస్థ తెలిపింది. అయితే తాజా న్యాయ, ప్రభుత్వ పరిణామాలతో ఆ కార్యక్రమాన్ని రద్దు చేసింది.

## ఉక్రెయిన్‌పై డ్రోన్లు, మిస్సైళ్లతో రష్యా దాడులు..

**12 మంది మృతి.. మృతుల్లో ఒక భారతీయుడు**



రష్యా-ఉక్రెయిన్ మధ్య భీకర యుద్ధం కొనసాగుతోంది. ఇరు దేశాలు పరస్పరం దాడులు చేసుకుంటున్నాయి. తాజాగా ఉక్రెయిన్‌పై రష్యా భారీ దాడికి దిగింది. రాజధాని కీవ్‌తోపాటు ఒడెశాపై డ్రోన్లు, మిస్సైళ్లతో విరుచుకుపడింది. ఈ ఘటనలో 12 మంది మరణించినట్లు సమాచారం. మృతుల్లో ఒక భారతీయుడు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. అతడికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.తాజా దాడులపై ఉక్రెయిన్ ప్రకటన చేసింది. దీని ప్రకారం.. సోమవారం రాత్రి నుంచి మంగళవారం వరకు ఉక్రెయిన్‌లోని 28 స్థావరాలపై రష్యా దాడి చేసింది. 200 వరకు డ్రోన్లు, మిస్సైళ్లతో దాడి చేసింది. కీవ్‌తోపాటు ఒడెశా ప్రాంతంపై బాలిస్టిక్ మిస్సైల్స్, క్రూయిజ్ మిస్సైల్స్, యాంటీ రాడార్ మిస్సైళ్లతో దాడికి పాల్పడింది. ఈ దాడుల కారణంగా ఉక్రెయిన్‌లో 12 మంది మరణించారు. మరికొందరు గాయపడ్డారు. క్షతగాత్రుల్లో పిల్లలు కూడా ఉన్నారు. జనావాసాలపై ఈ దాడులు జరిగాయి. అనేక ఇండ్లు, అపార్ట్‌మెంట్లు ధ్వంసమయ్యాయి.

# హైదరాబాద్‌లో పర్యటించిన ఉత్తరాఖండ్ పాత్రికేయుల బృందం



● కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, తెలంగాణ వారసత్వంపై క్షేత్రస్థాయి అవగాహన



**హైదరాబాద్, సెప్టెంబరు01 (నేటి దర్శిని):** తెలంగాణలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో పాటు హైదరాబాద్ నగర సుసంపన్న సాంస్కృతిక, చారిత్రక వారసత్వాన్ని తెలుసుకునే లక్ష్యంతో ఉత్తరాఖండ్‌కు చెందిన 15 మంది పాత్రికేయుల బృందం హైదరాబాద్‌లో పర్యటిస్తోంది. డెహ్రాడూన్ పత్రికా సమాచార సంస్థ (పీఐబీ) అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీ సంజీవ్ సుంద్రియాల్ నేతృత్వంలోని ఈ బృందం ఆగస్టు 31న నగరానికి చేరుకుని సెప్టెంబరు 4 వరకు వివిధ ప్రాంతాలను సందర్శించనుంది. పర్యటనలో భాగంగా తొలి రోజు హైదరాబాద్‌లోని పీఐబీ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ శ్రీమతి శృతి పాటిల్, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మానస్ కృష్ణకాంత్ తదితర అధికారులతో పాత్రికేయుల బృందం సమావేశమైంది. తెలంగాణలోని మీడియా రంగ పరిణామాలతో పాటు కేంద్ర ప్రభుత్వ విధానాలు, ప్రధాన పథకాలు, కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పీఐబీ, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) చేపడుతున్న సమాచార, ప్రచార కార్యక్రమాలను శృతి పాటిల్ వివరించారు.

కేంద్ర ప్రభుత్వ ప్రగతి ప్రధాన కార్యక్రమాలపై వాస్తవిక సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంలో పాత్రికేయుల భాగస్వామ్యం కీలకమని ఆమె పేర్కొన్నారు. హైదరాబాద్ పర్యటనలో పొందిన అనుభవాలను ఉత్తరాఖండ్ ప్రజలతో విస్తృతంగా పంచుకోవాలని, తెలంగాణపై ఆ రాష్ట్ర ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు తమ వంతు కృషి చేయాలని సూచించారు. అనంతరం కేంద్ర భూవిజ్ఞాన మంత్రిత్వశాఖ పరిధిలోని ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ (ఇన్‌కాయిస్)ను పాత్రికేయుల బృందం సందర్శించింది. సముద్ర పరిస్థితుల పర్యవేక్షణ, సునామీ ముందస్తు హెచ్చరిక వ్యవస్థ, సముద్ర పరిస్థితుల అంచనాలు, హెచ్చరికల జారీ తదితర అంశాల్లో భారత్ సాధించిన సామర్థ్యాన్ని ఇన్‌కాయిస్ అధికారులు వివరించారు. పర్యటనలో భాగంగా ఐసీఎంఆర్ ఆధ్వర్యంలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్), కార్మిక--ఉపాధి మంత్రిత్వశాఖ పరిధిలోని ఈఎస్ఐసీ ఆసుపత్రిని కూడా బృందం సందర్శించనుంది. పోషకాహార పరిశోధన, ప్రజారోగ్య చర్యలు, ఉద్యోగులకు జాతీయ బీమా పథకం ద్వారా అందుతున్న వైద్య సేవలపై ఈ సందర్శన ద్వారా అవగాహన పొందనుంది. అలాగే కేంద్ర జౌళి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని తెలంగాణ చేనేత, చేతివృత్తులకు సంబంధించిన ప్రదర్శనను పాత్రికేయులు సందర్శించనున్నారు. తెలంగాణ సంప్రదాయ కళలు, చేనేత రంగం, కళాకారులకు అందుతున్న ప్రోత్సాహంపై ఈ సందర్భంగా అవగాహన కల్పించనున్నారు. హైదరాబాద్ చారిత్రక, సాంస్కృతిక వైభవాన్ని ప్రత్యక్షంగా అనుభవించేలా సాలార్‌జంగ్ మ్యూజియం, చార్మినార్, లాడ్ బజార్ తదితర ప్రముఖ ప్రదేశాలను కూడా బృందం సందర్శించనుంది. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని వివిధ సంస్థల పనితీరుతో పాటు హైదరాబాద్ నగర చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని పరిచయం చేసే ఈ ఐదు రోజుల పర్యటన సెప్టెంబరు 4 వరకు కొనసాగనుంది.

# అనాథ యువతి వివాహానికి కాంగ్రెస్ నాయకుల అండ

● రూ.25,348 ఆర్థిక సహాయం అందజేత



**తలకొండపల్లి, సెప్టెంబర్ 01, (నేటి దర్శిని ):** తలకొండపల్లి మండలంలోని చుక్కాపూర్ గ్రామానికి చెందిన అనాథ యువతి లక్నమోని పూజా (ముదిరాజ్) వివాహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు మానవతా దృక్పథంతో రూ.25,348 ఆర్థిక సహాయం అందించారు. సెప్టెంబర్ 4న తలకొండపల్లి మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో పూజా వివాహం జరగనుంది.మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్ రెడ్డి రూ.10,116, మాజీ మండల అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్ రెడ్డి రూ.10,116, ఆమనగల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ (ముదిరాజ్) రూ.5,116 చొప్పున విరాళాలు అందించారు.పూజా 12 సంవత్సరాల క్రితం తల్లిదండ్రులను కోల్పోయిన విషయం తెలుసుకున్న నాయకులు, ఆమె వివాహానికి తమవంతు సహకారం అందించారు. ఈ సందర్భంగా నాయకులను స్థానికులు అభినందించగా, పూజా కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో గ్రామ పెద్దలు మాకం అంజయ్య, శ్రీనివాసులు, కాడిగే చంద్రకుమార్, కాంగ్రెస్ నాయకులు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మిడ్జిల్ కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

● పారిశుధ్య నిర్వహణపై నిర్లక్ష్యానికి ఎస్ఓకు షోకాజ్ నోటీసు





**మిడ్జిల్, సెప్టెంబర్ 01, (నేటి దర్శిని):** మిడ్జిల్ మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ), జూనియర్ కళాశాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.పాఠశాల ఆవరణ, పరిసరాలను పరిశీలించిన ఆయన అక్కడ పిచ్చి మొక్కలు, పొదలు, కంప చెట్లు, గడ్డి పెరిగి అపరిశుభ్రంగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు కేజీబీవీ ప్రత్యేక అధికారికి షోకాజ్ నోటీసు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.పాఠశాల పరిసరాల్లో 100 మీటర్ల పరిధిలోని ప్రాంతాన్ని పూర్తిగా శుభ్రం చేసి, అవసరమైన చోట మొరం మట్టి పోసి చదును చేయాలని సూచించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ తనిఖీలో జీసీడీఓ ఆశ్ర ఖాద్రి, మిడ్జిల్ ఎంపీడీఓ, సర్పంచ్, కేజీబీవీ ప్రత్యేక అధికారి, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మిడ్జిల్ మండల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం





● అర్హులందరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందిస్తాం: ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

**మిడ్జిల్, సెప్టెంబర్ 01,( నేటి దర్శిని):** అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మిడ్జిల్ మండలంలోని బైరంపల్లి నుంచి పర్యటన ప్రారంభించిన ఆయన బైరంపల్లి, కంచన్‌పల్లి, దోనూరు, సింగందొడ్డి, చౌటకుంట తండా, ఈదులబాయి తండా, మసిగుండ్లపల్లి, వేముల, వాడ్యాల గ్రామాల్లో పర్యటించి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చివరి లబ్ధిదారుడి వరకు చేరేలా అధికార యంత్రాంగం పనిచేస్తోందన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా బియ్యం, నిత్యావసర సరుకులు పొందడంతో పాటు వివిధ ప్రభుత్వ పథకాలకు అర్హత పొందే అవకాశం ఉంటుందని తెలిపారు.బైరంపల్లి రైతుల చిరకాల కోరిక మేరకు రూ.8.50 కోట్లతో చెక్‌డ్యామ్ మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. చెక్‌డ్యామ్ నిర్మాణంతో సాగునీటి వసతి మెరుగుపడటంతో పాటు భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంటుందన్నారు. వాడ్యాల పరిధిలోని చెక్‌డ్యామ్ పనులను కూడా త్వరితగతిన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.చౌటకుంట, ఈదులబాయి తండాల్లో గిరిజనులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. జీవనోపాధి, రహదారులు, మౌలిక సదుపాయాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మసిగుండ్లపల్లి గ్రామానికి విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు కోసం అధికారులతో చర్చించి చర్యలు చేపడతామని తెలిపారు.మిడ్జిల్ మండలంలోని ప్రతి గ్రామాన్ని ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జ్యోతి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ గౌస్, నాయకులు, సర్పంచులు, తహసీల్దార్ రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆధునిక సాగు పద్ధతులతో అధిక దిగుబడులు సాధించాలి

● వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్







**ఆమనగగల్లు, సెప్టెంబర్ 01(నేటి దర్శిని);** ఆధునిక సాగు పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ గౌడ్ అన్నారు.ఆత్మ పథకంలో భాగంగా ఆమనగల్లు మండలం రాంనుంతల గ్రామంలోని రైతు వేదికలో వరి సాగు చేసే రైతులకు ఫార్మర్ ఫీల్డ్ స్కూల్ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ వరి సాగులో రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటించాలని సూచించారు. శాస్త్రీయ విధానాలను అవలంబించడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు పంటలో అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందని తెలిపారు.వరి పంట సాగు సమయంలో రైతులు ఎప్పటికప్పుడు పంటను పరిశీలిస్తూ పురుగులు,తెగుళ్ల ఉనికిని గుర్తించాలని సూచించారు. అవసరం లేకుండా పురుగు మందులను వినియోగించకుండా, పంటలోని మిత్ర పురుగులు,శత్రు పురుగులను గుర్తించి వాటి ప్రభావాన్ని అంచనా వేసిన తర్వాతే తగిన చర్యలు చేపట్టాలని వివరించారు. మిత్ర పురుగులు పంటకు మేలు చేస్తాయని, శత్రు పురుగులు పంటకు నష్టం కలిగిస్తాయని రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం వ్యవసాయ అధికారులు,రైతులతో కలిసి గ్రామంలో సాగు చేస్తున్న వరి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.పంట ఎదుగుదల, పురుగుల ఉనికి, పంట సంరక్షణ చర్యలను పరిశీలిస్తూ రైతులకు పలు సూచనలు చేశారు. వరి సాగులో సమగ్ర పంట యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా నాణ్యమైన దిగుబడిని పొందవచ్చని తెలిపారు. రైతులు వ్యవసాయ శాఖ సూచనలు పాటిస్తూ శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని శ్రీనివాస్ గౌడ్ సూచించారు.ఈ కార్యక్రమంలో రాం నుంతల గ్రామానికి చెందిన రైతులతో పాటు ఏఈవోలు మీనాక్షి, నికిత, భూదేవి, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

● బిజెపి మున్సిపాలిటీ అధ్యక్షుడు విక్రం రెడ్డి




**ఆమనగల్లు,సెప్టెంబర్ 01 (నేటి దర్శిని):** అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి అన్నారు.నిన్న తెలంగాణ బీజేపీ పార్టీ కార్యాలయంపై ఎన్ ఎస్ యూఐ కార్యకర్తలు చేసిన దాడిని బీజేపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో శాంతియుతంగా తమ నిరసనను తెలియజేస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు పాల్పడటం పిరికిపంద చర్య అని మండిపడ్డారు.బీజేపీ ఉద్యమాలను తట్టుకోలేక కాంగ్రెస్ ప్రభుత్వం పిరికిపంద చర్యలకు పాల్పడుతోందని నాయకులు హెచ్చరించారు. తెలంగాణ బీజేపీ పార్టీ కార్యాలయ గేటుపై నల్ల ఇంకు పూయడం వంటి చర్యలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు.ఇలాంటి బెదిరింపులు, అక్రమ అరెస్టులకు బీజేపీ నాయకులు భయపడే ప్రసక్తే లేదని బిజెపి నాయకులు అన్నారు. ప్రజా సమస్యలపై ఎల్లప్పుడు ఉద్యమాలను కొనసాగిస్తామని,ప్రజల తరపున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.ప్రజాస్వామ్య దేశంలో ప్రజా సమస్యలను ఉద్యమాల ద్వారా, ప్రజాస్వామ్య పద్ధతుల్లో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలి కానీ దాడులకు పాల్పడటం ఏమాత్రం సమర్థనీయం కాదని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని,ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులను అరెస్టులు చేయడం ద్వారా ఉద్యమాలను అణచిచేయాలని చూస్తోందని బీజేపీ, బిజెవైఎం నాయకులు విమర్శించారు.ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రజా సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ప్రజా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. అనంతరం వారిని విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో విక్రమ్ రెడ్డి,గోరటి నరసింహ,చెక్కల లక్ష్మణ్,రవి రాథోడ్, గోజే ఆనంద్, వడ్డే రాజు,శివ, రమేష్ గౌడ్ ,పార్టీ కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

# దేవరకొండకు వైద్య వరాలు.. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ!





●డయాలసిస్ కేంద్రం విస్తరణ
●5 నుంచి 10 పడకలకు పెంపు..
●దివ్యాంగులకు ఇక స్థానికంగానే సదరం సేవలు
●త్వరలో దేవరకొండలోనే వాహనాల నమోదు
●కొత్త మండలాల్లో సమీకృత కార్యాలయ సముదాయాలు

**దేవరకొండ, సెప్టెంబర్ 1(నేటి దర్శిని):** ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. ప్రజా పాలనలో 1000 రోజులు పూర్తయిన సందర్భంగా దేవరకొండ నియోజకవర్గంలో పలు ప్రజోపయోగ కార్యక్రమాలను ప్రారంభించారు.
దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో 5 పడకల డయాలసిస్ కేంద్రాన్ని 10 పడకలకు విస్తరించారు. కొత్త వైద్య పరికరాలు, మౌలిక సదుపాయాలతో కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో కిడ్నీ వ్యాధిగ్రస్తులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే డయాలసిస్ సేవలు పొందే అవకాశం కలిగిందని ఎమ్మెల్యే తెలిపారు.
దివ్యాంగులకు ఊరట



సదరం ధ్రువపత్రాల కోసం నల్లగొండకు వెళ్లాల్సిన ఇబ్బందులకు పరిష్కారంగా దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో వారానికి రెండు రోజుల పాటు సదరం శిబిరాలు నిర్వహించేలా ప్రత్యేక కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రయాణ ఖర్చులు, సమయం, శారీరక ఇబ్బందులు తగ్గించడమే లక్ష్యమన్నారు.
అంబులెన్స్ సేవలు ప్రారంభంఅత్యవసర పరిస్థితుల్లో రోగులను సకాలంలో ఆసుపత్రికి తరలించేందుకు దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆర్‌టీఏ ఆధ్వర్యంలో అంబులెన్స్ సేవలను ప్రారంభించారు. అత్యవసర వైద్యంలో ప్రతి నిమిషం కీలకమని, ఈ సేవలు ఎంతో ఉపయోగపడతాయని బాలు నాయక్ పేర్కొన్నారు.వాహనాల నమోదు సేవలు ఇక ఇక్కడే! వాహనాల నమోదు కోసం మిర్యాలగూడకు వెళ్లాల్సిన పరిస్థితిని తొలగిస్తూ త్వరలో దేవరకొండలోనే వాహనాల నమోదు సేవలు అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియ పూర్తయిందని, త్వరలో కార్యాలయం ఏర్పాటు చేసి సేవలు ప్రారంభిస్తామని వెల్లడించారు.ఒకే చోట.. అన్ని ప్రభుత్వ సేవలు
కొత్తగా ఏర్పడిన మండలాల్లో ప్రజలు వివిధ ప్రభుత్వ శాఖల కోసం వేర్వేరు ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఒకే చోట అన్ని శాఖల సేవలు అందించే సమీకృత మండల కార్యాలయ సముదాయాల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.
"దేవరకొండ అభివృద్ధే నా లక్ష్యం"
గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు కృషి చేశానని బాలు నాయక్ గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రజల ఆశీర్వాదంతో మళ్లీ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఆసుపత్రిని మరింత బలోపేతం చేస్తున్నామని అన్నారు.
"వైద్యం, విద్య, సాగునీరు, రహదారులు, తాగునీరు, ప్రభుత్వ సేవలు, సంక్షేమం.. ప్రతి రంగంలో దేవరకొండను అభివృద్ధి చేయడమే నా లక్ష్యం. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తాం" అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, వైద్యాధికారులు, ఆర్డీవో, మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవరెడ్డి, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, ఆర్టీఐ నాయకులు, వైద్య సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

## కొండేటి శ్రీను ను పరామర్శించిన పలువురు నాయకులు





**నిడమానూరు, సెప్టెంబర్ 1 (నేటి దర్శిని):** సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను తండ్రి కొండేటి చంద్రయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో పలువురు రాజకీయ నాయకులు ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. చంద్రయ్య మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం చంద్రయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.నాగార్జునసాగర్ మాజీ శాసనసభ్యులు నోముల భగత్ కుమార్, నిడమానూరు సీనియర్ కాంగ్రెస్ నాయకులు మేరెడ్డి వెంకట్ రాహుల్ రెడ్డి వేర్వేరుగా కొండేటి శ్రీను కుటుంబాన్ని పరామర్శించి తమ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిడమానూరు మండలం మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు పెదమాం యాదయ్య, ఊట్కూరు మాజీ ఎంపీటీసీ బత్తిని నరేందర్ గౌడ్, వేంపాడు మాజీ ఎంపీటీసీ చిలుముల సంతోష్, బంకాపురం మాజీ ఎంపీటీసీ చింతమల్ల వెంకన్న, వేంపాడు మాజీ ఎంపీటీసీ జువ్వి రాజు, కొంచెం సతీష్, నిడమానూరు వార్డు నంబర్ సభ్యుడు గూగుల శంకర్ తదితరులు పాల్గొని చంద్రయ్యకు నివాళులర్పించారు.

## వేతనాల నిలుపుదలపై ఉపాధ్యాయుల ఆగ్రహం!

●నిబంధనలు బేఖాతర్.. హాజరైన, విధి నిర్వహణలో బయటకు వెళ్లిన ఉపాధ్యాయుల జీతాలకు కోత!
●చింతపల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలిపై విచారణకు ఉపాధ్యాయ సంఘం డిమాండ్



**చింతపల్లి సెప్టెంబర్ 1 (నేటి దర్శని) :** పాఠశాలకు విధులకు హాజరైన ఉపాధ్యాయులతో పాటు, అధికారికంగా విధి నిర్వహణ నిమిత్తం బయటకు వెళ్లిన ఉపాధ్యాయుల వేతనాలను ఎలాంటి ఉత్తర్వులు, శాఖాపరమైన ప్రక్రియ లేకుండానే నిలుపుదల చేస్తున్నారని ఆరోపిస్తూ తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య చింతపల్లి మండల శాఖ ఆగ్రహం వ్యక్తం చేసింది.చింతపల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు ఆర్. లక్ష్మి ఉపాధ్యాయుల వేతనాలను నిబంధనలకు విరుద్ధంగా నిలుపుదల చేస్తూ వారిని మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారని సంఘం నాయకులు ఆరోపించారు. విధులకు హాజరైన ఉపాధ్యాయుల వేతనాలను నిలుపుదల చేయడానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను నిగ్గుతేల్చాలని వారు కోరారు. విధి నిర్వహణలో భాగంగా అధికారికంగా బయటకు వెళ్లిన ఉపాధ్యాయుల వేతనాలను సైతం నిలుపుదల చేయడం సమంజసం కాదని పేర్కొన్నారు.
ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య చింతపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో మండల విద్యాధికారికి వినతిపత్రం సమర్పించారు. ఉపాధ్యాయులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారనే ఆరోపణలపై విచారణ చేపట్టి, తప్పు నిర్ధారణ అయితే సంబంధిత ప్రధానోపాధ్యాయురాలిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
"ఉపాధ్యాయుల వేతనాలతో చెలగాటం వద్దు"ఉపాధ్యాయుల సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించి, నిలుపుదల చేసిన వేతనాలను నిబంధనల ప్రకారం విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య నాయకులు కోరారు.

## అంగడి కుర్మపల్లిలో ఆధ్యాత్మిక

●శ్రీ కాళికాదేవి శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థాన నిర్మాణానికి ఘనంగా శంకుస్థాపన
●భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా నూతన ఆలయం..





**చింతపల్లి, సెప్టెంబర్ 1( నేటి దర్శని) :** చింతపల్లి మండలం అంగడి కుర్మపల్లి గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. గ్రామ నడిబొడ్డున కొలువైన శ్రీ ఆదిపరాశక్తి కాళికాదేవి, జగద్గురు శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వారి దేవస్థాన నూతన నిర్మాణానికి భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా శంకుస్థాపన నిర్వహించారు. మంగళ వాయిద్యాలు.. వేద మంత్రోచ్చారణల నడుమ భూమిపూజ
కుర్మపల్లి 'ఎక్స్' రోడ్డు వద్ద చేపట్టనున్న దేవస్థాన నిర్మాణానికి ముహూర్త సమయంలో ఉదయం 11 గంటలకు దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక పూజలు, వేద మంత్రోచ్చారణలతో భూమిపూజ జరిపారు.
భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారం
ఎన్నో ఏళ్లుగా భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన శ్రీ కాళికామాత, శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వారి దేవస్థానాన్ని మరింత అభివృద్ధి చేయాలనే సంకల్పంతో నూతన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.
దాతల సహకారం.. గ్రామస్థుల భక్తి
దేవస్థాన నిర్మాణానికి దాతలుగా ముంజంపల్లి సత్యనారాయణ, శ్రీమతి జంగమ్మ వ్యవహరిస్తుండగా, దేవస్థాన చైర్మన్ ముంజంపల్లి విద్యాధరాచారి ధర్మపత్ని శ్రీమతి వేణి వారాల రామచంద్రయ్య తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.
అంగడి కుర్మపల్లి గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. నూతన దేవస్థానం నిర్మాణంతో గ్రామానికి మరింత ఆధ్యాత్మిక వైభవం చేకూరనుందని భక్తులు హర్షం వ్యక్తం చేశారు."శ్రీ కాళికామాత -- శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆశీస్సులు గ్రామ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలి" అని భక్తులు ఆకాంక్షించారు.

## మెయిన్ రోడ్లపై ఫుడ్ ట్రక్కుల దందా

●రాత్రయితే చాలు రోడ్డే వ్యాపార అడ్డాలు
●మెయిన్ రోడ్లపై ప్రయాణం వాహనదారులకు నరకయాతన
●మెట్టుగూడ,ఉప్పల్ మార్గంలో ఇష్టారాజ్య పార్కింగ్
●ఒక్కో వాహనం నుంచి రూ.10 వేల వరకు వసూళ్లంటూ గుసగుసలు
●ట్రాఫిక్ పోలీసుల నిర్లక్ష్యంపై వాహనదారుల ఆగ్రహం
●ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఏదీ.?

**హైదరాబాద్, సెప్టెంబర్01 (నేటి దర్శిని):** హైదరాబాద్ నగరంలో రాత్రి వేళ రోడ్లపై ఫుడ్ ట్రక్కుల దందా జోరందుకుంటోంది. ప్రధాన రహదారులు, కూడళ్లను వ్యాపార కేంద్రాలుగా మార్చేస్తూ ఫుడ్ ట్రక్కులు ఇష్టారాజ్యంగా నిలిపివేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మెట్టుగూడ నుంచి ఉప్పల్ చౌరస్తా వరకు రాత్రి సమయాల్లో ఫుడ్ ట్రక్కుల వద్ద అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్ రద్దీ మరింత పెరుగుతోందని, ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు.
రోడ్డుపైనే వాహనాలను నిలిపి ఆహార విక్రయాలు నిర్వహిస్తుండటంతో ఒకవైపు ట్రాఫిక్ నెమ్మదిస్తుండగా.. మరోవైపు ఫుడ్ ట్రక్కుల వద్దకు వచ్చే వాహనాలతో పరిస్థితి మరింత గందరగోళంగా మారుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు పక్కన వ్యాపారాలు సాగుతున్నా ట్రాఫిక్ పోలీసులు అసలు పట్టించుకోవడం లేదనే విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి.

**రూ.10 వేల వరకు వసూళ్లంటూ గుసగుసలు**

ఫుడ్ ట్రక్కులకు ప్రధాన రహదారుల వెంట వ్యాపారానికి అనుమతి ఎలా లభిస్తోంది.? వాటి పార్కింగ్‌కు ఎవరు అనుమతిస్తున్నారు.? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఒకవేళ అనుమతులు లేకుంటే అక్రమంగా నిర్వహిస్తే ఎందుకు అధికారులు కఠిన చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఒక్కో వాహనం నుంచి నెలకు రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నారనే గుసగుసలు స్థానికంగా వినిపిస్తున్నప్పటికీ ఈ ఆరోపణల పై అధికారులు ఎందుకు స్పందించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ ఆరోపణలపై హైదరాబాద్ కమిషనర్ ఉన్నత అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉందని వాహనాదారులు కోరుతున్నారు.



మెట్టుగూడ చౌరస్తాలో రహదారిపై ఫుడ్ ట్రక్



**ఉచిత టిఫిన్లా.. నెల మామూళ్లా.?**

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ రోడ్లపై ఫుడ్ ట్రక్కులు జోరుగా నడుస్తున్నా చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులకు నెల మామూలుతో పాటు ఉచిత టిఫిన్లు అందుతున్నాయా.?' అంటూ కొందరు వాహనదారులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ప్రజల నుండి ట్రాఫిక్ పోలీసుల నిర్లక్ష్యంపై అనేక ఆరోపణలు వస్తుండడంతో పోలీసు శాఖ దీనిపై స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

**ఉన్నత అధికారుల ఆదేశాలు బుట్టదాఖలేనా.?**

ట్రాఫిక్ సమస్యలను నియంత్రించేందుకు ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో వాటి అమలు సరిగ్గా కనిపించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అడిషనల్ ట్రాఫిక్ సీపీ ఆదేశాలు కూడా క్షేత్రస్థాయిలో పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
రాత్రి వేళల్లో ప్రధాన రహదారులపై జోరుగా వ్యాపారాలు సాగుతున్నా ఉన్నతాధికారుల పర్యవేక్షణ అసలు లేకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ట్రాఫిక్ నియంత్రణతో పాటు రోడ్ల ఆక్రమణలు, అక్రమ పార్కింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఫుడ్ ట్రక్కుల నిర్వహణకు అనుమతులు, పార్కింగ్ స్థలాలు, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై హైదరాబాద్ కమిషనర్ సమగ్ర తనిఖీలు చేపట్టి, ముఖ్యంగా రాత్రి సమయాలలో విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తున్న సిబ్బంది అధికారులపై తప్పు తేలితే కఠిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

# ఆరోగ్యవంతమైన చిన్నారులతోనే ఆరోగ్యవంతమైన భారత్ నిర్మాణం: డా. కె. లక్ష్మణ్

**హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నేటి దర్శిని):** ఆరోగ్యవంతమైన, దృఢమైన చిన్నారులే బలమైన భారతదేశానికి పునాది అని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. దేశ నిర్మాణం అంటే కేవలం భవనాలు, మౌలిక వసతుల నిర్మాణం మాత్రమే కాదని, చిన్నారులను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడమే నిజమైన దేశ నిర్మాణమని పేర్కొన్నారు. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ పరిధిలోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) ఆధ్వర్యంలో 'పోషణ మాసోత్సవం--2026'పై నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ కమ్యూనికేషన్ అండ్ అవుట్‌రీచ్ ప్రోగ్రామ్ (ఐకాప్)ను మంగళవారం హైదరాబాద్ గగన్‌మహల్‌లోని ఏవీ కాలేజ్ ప్రాంగణంలో డాక్టర్ కె. లక్ష్మణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పోషకాహార ప్రదర్శనను ఆయన సందర్శించి సీబీసీని అభినందించారు. పోషకాహారంపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు ఆలోచింపజేసే అంశాలతో ప్రదర్శన ఆకట్టుకుంటోందని అన్నారు. దేశ అభివృద్ధిలో పోషకాహారం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.




**విద్యార్థులు భాగస్వాములు కావాలి**

పోషకాహారంపై అవగాహన కార్యక్రమాల్లో విద్యార్థులు, యువత క్రియాశీల భాగస్వాములుగా మారాలని డాక్టర్ లక్ష్మణ్ పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు, చిన్నారులు, ముఖ్యంగా వెనుకబడిన వర్గాల్లో సరైన పోషకాహారంపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. రక్తహీనత, తక్కువ బరువు, అధిక బరువు, ఊబకాయం, ఎదుగుదల లోపం వంటి సమస్యలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. ఇలాంటి ప్రజా అవగాహన కార్యక్రమాలను విద్యార్థులు ప్రాజెక్టులుగా చేపట్టేలా కళాశాల యాజమాన్యాలు ప్రోత్సహించాలని కోరారు.

**9 కోట్ల మంది చిన్నారుల పర్యవేక్షణ**

దేశవ్యాప్తంగా సుమారు 14 లక్షల అంగన్‌వాడీ కేంద్రాలు, దాదాపు 9 కోట్ల మంది చిన్నారుల ఆరోగ్యం, పోషణ అంశాలను కేంద్ర ప్రభుత్వం డిజిటల్ విధానాల ద్వారా పర్యవేక్షిస్తోందని డాక్టర్ లక్ష్మణ్ తెలిపారు. దేశంలోని 11 లక్షలకు పైగా పాఠశాలల్లో సుమారు 12 కోట్ల మంది చిన్నారులకు ప్రతిరోజూ వేడిగా వండిన భోజనం అందిస్తున్నట్లు వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను కూడా ఆయన ప్రస్తావించారు. తెలంగాణలో వయస్సుకు తగిన శారీరక ఎదుగుదల లేని చిన్నారుల నిష్పత్తి 33 శాతం నుంచి 27 శాతానికి తగ్గిందని తెలిపారు. క్షేత్రస్థాయి సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తల కృషితో పాటు ప్రభుత్వ సహకారంతో ఈ పురోగతి సాధ్యమైందన్నారు.

**చిరుధాన్యాలు, సంప్రదాయ ఆహారాన్ని ప్రోత్సహించాలి**

చిరుధాన్యాలు, సంప్రదాయ ఆహార పద్ధతులను మరింతగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. 2023ను అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన విషయాన్ని గుర్తుచేస్తూ.. చిరుధాన్యాల్లోని పోషక విలువలతో పాటు చిన్న, వర్షాధార రైతులకు వాటి సాగుతో కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ప్రదర్శించిన చిరుధాన్య ఆధారిత పోషకాహార ఉత్పత్తుల తయారీదారులను ఆయన అభినందించారు. యువత ఆవిష్కరణలు, అంకుర సంస్థలు, ఔత్సాహిక అవకాశాలను అన్వేషించాలని సూచించారు. ఉద్యోగాల కోసం ఎదురుచూడటంతో పాటు ఉద్యోగాలను సృష్టించే దిశగా యువత ఆలోచించాలని పిలుపునిచ్చారు.

**ఆహారంతో పాటు శారీరక దృఢత్వం ముఖ్యం**

పోషకాహారంతో పాటు శారీరక దృఢత్వానికి కూడా ప్రాధాన్యం ఇవ్వాలని డాక్టర్ లక్ష్మణ్ సూచించారు. విద్యార్థులు క్రీడలు, శారీరక వ్యాయామాల్లో చురుకుగా పాల్గొనాలని కోరారు. ఈ లక్ష్యంతోనే కేంద్ర ప్రభుత్వం 'ఖేలో ఇండియా' వంటి కార్యక్రమాలను చేపడుతోందని తెలిపారు. శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా ఎంతో ఉపయోగకరమని పేర్కొంటూ ఆరోగ్యకరమైన ఆహారం, వ్యాయామం, యోగాను యువత రోజువారీ జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు.

**ప్రజల్లోకి పోషకాహార సందేశాలు**

పీఐబీ/సీబీసీ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రీమతి శ్రుతి పాటిల్ ప్రారంభోపన్యాసం చేస్తూ.. పోషకాహారం కేవలం ఆహారానికి మాత్రమే పరిమితం కాదని, ఆరోగ్యం, ఉత్పాదకత, అభ్యాసం, జీవన నాణ్యతతో ముడిపడి ఉందని అన్నారు. సంప్రదాయ జానపద కళారూపాలైన ఒగ్గుకథ, యక్షగానం, వీధి నాటకం, కోలాటం తదితరాల ద్వారా విశ్వసనీయమైన పోషకాహార సందేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సీబీసీ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. పోషకాహారంపై అవగాహనను ఆరోగ్యకరమైన జీవనశైలిగా మార్చడం, ఆరోగ్యవంతమైన మరియు బలమైన భారతదేశ నిర్మాణానికి దోహదపడటమే కార్యక్రమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఏవీ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి శ్రీ అచ్యుత్ ప్రసాద్ రెడ్డి, ఏవీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పద్మ, పీఐబీ, సీబీసీ అధికారులు, సిబ్బంది తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. సెప్టెంబర్ 1 నుంచి 5 వరకు ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో సుమారు 40 పోషకాహార సమాచార ప్యానెళ్లతో ప్రదర్శన, నిపుణుల ప్రసంగాలు, ఐఈసీ స్టాళ్లు, వివిధ ప్రదర్శనాత్మక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పోషకాహారం, ఆరోగ్యకరమైన ఆహార పద్ధతులపై అవగాహన కల్పించే ఒగ్గుకథ, వీధి నాటకం, కోలాటం, యక్షగానం వంటి సంప్రదాయ జానపద కళా ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

## వాడ్యాల గ్రామంలో ఫార్మ్ పాండ్ పనులు

- పరిశీలించిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



**మిడ్జిల్, సెప్టెంబర్ 01,( నేటి దర్శిని ):** మిడ్జిల్ మండలం వాడ్యాల గ్రామంలో కొనసాగుతున్న ఫార్మ్ పాండ్ పనులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ మంగళవారం పరిశీలించారు. ఎం.పి.డి.ఓ, ఎ.పి.ఓ, పంచాయతీ కార్యదర్శితో కలిసి క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని సమీక్షించారు.ఫార్మ్ పాండ్ నిర్మాణ పనుల నాణ్యత, పనుల అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే క్షేత్రస్థాయి సిబ్బందితో మాట్లాడి, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల కింద చేపడుతున్న పనుల అమలు, పురోగతిపై సమీక్షించారు.పనులను నిర్దేశిత ప్రమాణాల ప్రకారం నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

## బీజేపీ కార్యాలయంపై దాడి కాంగ్రెస్ అరాచక రాజకీయాలకు నిదర్శనం

- దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- బీజేపీ రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి

**మిడ్జిల్, సెప్టెంబర్ 01 (నేటి దర్శిని మహబూబ్‌నగర్ జిల్లా బ్యూరో):** బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ నాయకులు దాడికి పాల్పడటాన్ని బీజేపీ రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ పార్టీల కార్యాలయాలపై భౌతిక దాడులకు పాల్పడటం పిరికిపంద చర్య అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.రాజ్యాంగ ప్రతిని చేతబట్టి నీతి సూక్తులు చెప్పే కాంగ్రెస్ నాయకులు, బీజేపీ కార్యాలయంపై జరిగిన దాడిపై స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఘటన కాంగ్రెస్ పార్టీ దివాళాకోరుతనానికి, నీచ రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు.తెలంగాణలో అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చి చాలా కాలం గడిచినా హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోతున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలను బీజేపీ ప్రశ్నిస్తుండటాన్ని జీర్ణించుకోలేక భౌతిక దాడులకు పాల్పడుతున్నారని అన్నారు.
రాష్ట్ర రాజధాని నడిబొడ్డున ఉన్న బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి రక్షణ కల్పించడంలో పోలీసులు, ఇంటెలిజెన్స్ వ్యవస్థ విఫలమయ్యాయని ముచ్చర్ల జనార్దన్ రెడ్డి ఆరోపించారు. దాడికి పాల్పడిన వారిని, వారి వెనుక ఉన్న సూత్రధారులను గుర్తించి వెంటనే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.భౌతిక దాడులతో బీజేపీ శ్రేణులను భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తే అది సాధ్యం కాదని స్పష్టం చేశారు. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో బీజేపీ ఎట్టి పరిస్థితుల్లోనూ వెనకడుగు వేయదన్నారు.కాంగ్రెస్ పార్టీ ఇలాంటి అరాచక రాజకీయాలను కొనసాగిస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ముచ్చర్ల జనార్దన్ రెడ్డి హెచ్చరించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడేందుకు ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం సమర్థవంతంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



బీజేపీ రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి

## బీజేపీ రాష్ట్ర సాంస్కృతిక కమిటీలో చింతపల్లి కృష్ణారావుకు చోటు

- నల్లగొండ నుంచి రాష్ట్ర కమిటీ సభ్యుడిగా నియామకం

**చింతపల్లి సెప్టెంబర్ 1 (నేటి దర్శిని):** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర జనచైతన్య కళామండలి సాంస్కృతిక విభాగం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా చింతపల్లి కృష్ణారావు నియమితులయ్యారు. నల్లగొండ జిల్లా నుంచి ఆయనకు రాష్ట్ర కమిటీలో చోటు కల్పిస్తూ పార్టీ రాష్ట్ర విభాగం నియామక ఉత్తర్వులు జారీ చేసింది.రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని కృష్ణారావు తెలిపారు. తన నియామకానికి సహకరించిన రామచంద్రరావుకు కృతజ్ఞతలు తెలుపుతూ, సాంస్కృతిక విభాగంలో అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.



## నిరుపయోగంగా మారుతున్న క్రీడా ప్రాంగణాలు

- లక్షలు ఖర్చు చేసిన యువతకు అందని ఆట స్థలాలు
- నిర్వహణ లేక వేల వేల పోతున్న మైదానాలు, వసతులు లేక క్రీడాకారుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు

**ఆమనగల్లు, సెప్టెంబర్ 01(నేటి దర్శిని);** రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు పట్టణంలో, గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా ప్రతిభను వెలికి తీసి యువతను క్రీడల వైపు ప్రోత్సహించాలని ఉద్దేశంతో ఏర్పాటు చేసిన తెలంగాణ క్రీడా ప్రాంగణాలు లక్ష్యం దిశగా ముందుకు సాగడం లేదన్న విమర్శలు ఆమనగల్లు పట్టణంలో వినిపిస్తున్నాయి. ఆమనగల్లు మండలంలోని పలు గ్రామాల్లో క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు స్థలాలను గుర్తించి,కొన్నిచోట్ల ప్రారంభోత్సవాలు కూడా నిర్వహించినప్పటికీ,ప్రస్తుతం వాటి నిర్వహణపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో క్రీడాకారులకు పూర్తిస్థాయిలో ఉపయోగపడటం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.




**ప్రతి గ్రామానికి క్రీడా ప్రాంగణం....**

గ్రామీణ యువతకు ఆటస్థలం అందుబాటులో ఉండాలని లక్ష్యంతో ప్రభుత్వం ప్రతి గ్రామపంచాయతీలో క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలో క్రీడా ప్రాంగణం క్రీడాకారుల కొరకు ఏర్పాటు చేశారు. ఆ క్రీడా ప్రాంగణాన్ని మున్సిపల్ పాలకవర్గం ఆలన పాలన గాలికి వదిలేశారని ప్రజల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోను క్రీడా ప్రాంగణాలను మరిన్ని ఏర్పాటు చేసి, మరిన్ని స్థలాలను గుర్తించి క్రీడా ప్రాంగణాల ఏర్పాటు చేస్తే క్రీడాకారులకు ఉపయోగకరంగా ఉంటుందని పట్టణ ప్రజలు కోరుతున్నారు. క్రీడా ప్రాంగణాల ప్రారంభ సమయంలో వాలీబాల్, కబడ్డీ,కోకో వంటి క్రీడలకు అవసరమైన వసతులు కల్పిస్తామని అధికారులు, ప్రజా ప్రతినిధులు హామీలు ఇచ్చారు.అయితే మైదానాలను నిరంతరం శుభ్రపరచకపోవడం, పిచ్చి మొక్కలు తొలగించకపోవడం, ఆట పరికరాలను అందుబాటులో ఉంచకపోవడం, వంటి అనేక సమస్యలతో ఆమనగల్లు క్రీడా ప్రాంగణం క్రీడాకారులకు స్వాగతం పలుకుతుందని ఆమనగల్లు పట్టణ, మండల ప్రజలు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. కాబట్టి ప్రజా ప్రతినిధులు,అధికారులు తక్షణమే క్రీడా ప్రాంగణాలను, క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆమనగల్లు పట్టణ ప్రజలు అధికారులను వేడుకుంటున్నారు.

# సెప్టెంబర్ 1ని విద్రోహ దినంగా ప్రకటిస్తూ ఉద్యోగుల నిరసన


**ఆమనగల్లు,సెప్టెంబర్ 01(నేటి దర్శిని);**
తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి పిలుపు మేరకు సెప్టెంబర్ 1ని పాత పెన్షన్ విధానం కోసం పోరాడుతున్న ఉద్యోగుల విద్రోహ దినంగా ప్రకటిస్తూ ఆమనగల్లులో ఉద్యోగులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఆమనగల్లు మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం,బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి,చేతుల్లో ప్లకార్డులు పట్టుకుని తమ నిరసనను వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన హామీల మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే నూతన పింఛను విధానాన్ని రద్దు చేసి పాత పింఛను విధానాన్ని అమలు చేస్తామని, పెండింగ్‌లో ఉన్న కరువు భత్యాలను విడుదల చేస్తామని,వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేసి వేతన సవరణ అమలు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.అయితే ప్రభుత్వం ఏర్పడి మూడేళ్ల పైన గడుస్తున్నప్పటికీ తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారంలో జాప్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.నూతన పింఛను విధానం వల్ల ఉద్యోగులు, వారి కుటుంబాలు భవిష్యత్తుపై ఆందోళన




చెందుతున్నారని,వెంటనే నూతన పింఛను విధానాన్ని రద్దు చేసి పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న కరువు భత్యాలను తక్షణమే విడుదల చేసి, వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆమనగల్లు తాలూకా యూనిట్ అధ్యక్షుడు కొండాపురం శేఖర్, కార్యదర్శి జంతుక బాలరాజు, ఉపాధ్యక్షుడు కావలి కుమార్, కోశాధికారి జి.వేణు, నిర్వహణకార్యదర్శి సి.ఆంజనేయులు, కార్యవర్గ సభ్యుడు సి.మధు, పాఠశాల పర్యవేక్షకురాలు ఆర్.సుమలత, జి.రాధాకృష్ణ, ఎస్.రాబర్ట్, రమేష్,ఝాన్సీ, కిషన్, అహ్మద్,శైలజతో పాటు ఉపాధ్యాయులు జైపాల్, పర్వతాలు,వెంకటయ్య, కృష్ణయ్య, నాగమణి, అలివేలు,విజయ,లక్ష్మణ్, విష్ణు,రవి, చంద్రశేఖర్,డిగ్రీ కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# నాడు నిధుల వరద..నేడు నిధుల కొరత!

- **హోదా పెరిగింది.. అభివృద్ధి తగ్గింది!**
- **మున్సిపాలిటీగా మారినా.. మారని జిన్నారం సమస్యలు!**
- **అభివృద్ధికి ఆమడదూరంలో జిన్నారం!**
- **నాడు నిండుకుండ.. నేడు బోర్ల బిందె!**
- **మున్సిపల్ హోదా వచ్చిందిగానీ.. అభివృద్ధి మాత్రం ఎక్కడ?**
- **మండల కేంద్రం నుంచి మున్సిపల్ కేంద్రంగా మారినా.. అభివృద్ధిలో వెనుకడుగు!**
- **ఆది రామకృష్ణ ఆవేదన**






**జిన్నారం సెప్టెంబర్ 1 (నేటి దర్శనం)**
సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గంలో జిన్నారం మండల కేంద్రం నేడు నిధుల కొరతతో వెలవెలబోతోందని యువజన నాయకుడు ఆది రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో జిన్నారం మండల పరిధిలోని బొల్లారం, గుమ్మడిదల, గడ్డపోతారం తదితర ప్రాంతాలు కలిసి ఉండటంతో పరిశ్రమల నుంచి పెద్ద ఎత్తున సి ఎస్ ఆర్ నిధులు సమకూరేవని, తద్వారా మండలంలోని అనేక ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరిగేవని ఆయన గుర్తుచేశారు.ప్రస్తుతం ఆయా ప్రాంతాలు వేర్వేరు మండలాలు, మున్సిపాలిటీలుగా విడిపోవడంతో జిన్నారం మున్సిపల్ కేంద్రానికి గతంలో ఉన్న స్థాయిలో నిధులు, అభివృద్ధి అవకాశాలు రావడం లేదని పేర్కొన్నారు. దీంతో ఒకప్పుడు నిండుకుండలా కనిపించిన జిన్నారం నేడు నిధుల కోసం ఎదురుచూస్తున్న పరిస్థితికి చేరుకుందని ఆవేదన వ్యక్తం చేశారు."గతంలో నిధులు వరదలా వచ్చేవి.. ఇప్పుడు నిధుల కొరత వెంటాడుతోంది" అని ఆయన అన్నారు. జిన్నారం ఇప్పటికే చాలా నష్టపోయిందని, ఈ పరిస్థితి మరింత తీవ్రం కాకముందే ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.ముఖ్యంగా జిన్నారం పరిసరాల్లోని పరిశ్రమల యాజమాన్యాలు తమ సి ఎస్ ఆర్ నిధుల్లో కొంత భాగాన్ని జిన్నారం మున్సిపల్ కేంద్రం అభివృద్ధికి కేటాయించాలని ఆది రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. రహదారులు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, మౌలిక వసతులు తదితర అభివృద్ధి పనులకు పరిశ్రమలు సహకరిస్తే జిన్నారం తిరిగి అభివృద్ధి బాటలో పయనించే అవకాశం ఉంటుందని అన్నారు.అందరూ బాగుండాలి.. అందులో జిన్నారం కూడా ఉండాలి. రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీల నాయకులు, పరిశ్రమల యాజమాన్యాలు బాధ్యతగా ఆలోచించి జిన్నారం అభివృద్ధికి సహకరించాలి" అని ఆయన పిలుపునిచ్చారు.ఈ మేరకు యువజన నాయకుడు ఆది రామకృష్ణ పత్రికా ప్రకటనతో పాటు సోషల్ మీడియా వేదికగా తన అభిప్రాయాలను వెల్లడించారు.

# చిట్కుల్‌లో 'గులాబీ' గుబులు..

- **కాంగ్రెస్ నేతల జంప్‌కు రంగం సిద్ధం!**
- **త్వరలో భారీ చేరికలకు సంకేతాలు..**
- **హరీశ్‌రావుతో కాంగ్రెస్ ముఖ్య నేతల భేటీ**



**పటాన్ చెరు సెప్టెంబర్ 1(నేటి దర్శిని)**
సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని చిట్కుల్‌లో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు బీఆర్ఎస్ వైపు అడుగులు వేస్తున్నారన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. త్వరలోనే పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరనున్నట్లు సంకేతాలు వెలువడుతున్నాయి. ఈ క్రమంలో చిట్కుల్ కాంగ్రెస్ నాయకులు పటాన్‌చెరు మండల బీఆర్ఎస్ ఇన్‌చార్జ్, మాజీ జెడ్పీటీసీ గడీల శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో పటాన్‌చెరు నియోజకవర్గ కో-ఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్‌లతో కలిసి మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావును కోకాపేటలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.అనంతరం చిట్కుల్ కాంగ్రెస్ నాయకులు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా చిట్కుల్ గ్రామ అభివృద్ధి, స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, పటాన్‌చెరు నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై చర్చ జరిగినట్లు తెలిపారు.

**'గులాబీ' వైపు ఎందుకు?**
చిట్కుల్ గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్‌తో కలిసి పనిచేయాలనే ఆసక్తిని కాంగ్రెస్ నాయకులు వ్యక్తం చేసినట్లు సమాచారం. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ నాయకత్వం చేస్తున్న పోరాటం తమను ఆకర్షించిందని, అందుకే పార్టీలో చేరేందుకు పలువురు నాయకులు ఆసక్తి చూపుతున్నట్లు వెల్లడించారు.త్వరలోనే చిట్కుల్‌కు



చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరనున్నట్లు నాయకులు పేర్కొనడంతో స్థానిక రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు తెరలేచింది. ఈ పరిణామం పటాన్‌చెరు నియోజకవర్గ రాజకీయ సమీకరణాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందన్నది ఆసక్తిగా మారింది.ఈ కార్యక్రమంలో చిట్కుల్ మాజీ వార్డు సభ్యులు వల్లెపు వెంకటేష్, రాజ్‌కుమార్, మురళి యాదవ్, కాంగ్రెస్ నాయకులు మడుగుల సంతోష్, మంజలి శ్రీను, వల్లెపు రాయుడు, భీమ, యాది, మాడుగుల వెంకట్‌తో పాటు ఇస్నాపూర్ మున్సిపల్ కౌన్సిలర్లు తలారి ఆంజనేయులు, బేగరి వెంకటేష్, కో-ఆప్షన్ సభ్యులు విష్ణువర్ధన్‌రెడ్డి, గుండారపు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# చిల్వేర్ పాఠశాలలో విద్యార్థులకు బూట్లు, బెల్టులు, టైలు పంపిణీ




**మిడ్జిల్, సెప్టెంబర్ 01, (నేటి దర్శిని)**
మిడ్జిల్ మండలంలోని చిల్వేర్ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు బూట్లు, బెల్టులు, టైలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగరాజు గౌడ్, హెచ్‌ఎం శ్యామల, ఉపాధ్యాయులు రమేష్, వెంకటయ్య, హిరియానాయక్, గురు ప్రసాద్, పంచాయతీ సెక్రటరీ ఖలీలొద్దీన్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ 420 హామీలపై నేటి నుంచి బీఆర్ఎస్ పోరుబాట

- **సెప్టెంబర్ 2 నుంచి 7 వరకు వివిధ అంశాలపై నిరసనలు..**
- **'బాకీ కార్డు' ఉద్యమం...**







**పటాన్ చెరు సెప్టెంబర్ 1(నేటి దర్శిని)**
సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం పటాన్‌చెరులోని క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులతో సమావేశమైన ఎమ్మెల్యే ఉద్యమ కార్యాచరణను వెల్లడించారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలతో పాటు 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ప్రజలకు ఇవ్వాల్సిన బాకీలను ఎప్పటిలోగా చెల్లిస్తారో సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ సెప్టెంబర్ 2 నుంచి 7వ తేదీ వరకు పటాన్‌చెరు నియోజకవర్గంలో వివిధ నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ ఆదేశాల మేరకు 'బాకీ కార్డు' ఉద్యమం చేపట్టనున్నట్లు చెప్పారుసెప్టెంబర్ 2న పటాన్‌చెరులో ర్యాలీ, బాకీ కార్డుల పంపిణీ, 420 అడుగుల ఫ్లెక్సీ ప్రదర్శన; 3న ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్‌పై ర్యాలీలు; 4న కొల్లూరులో డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద ధర్నా; 5న గుమ్మడిదలలో రైతు సదస్సు; 6న తాగునీరు, వీధి దీపాలు, శాంతిభద్రతల సమస్యలపై దీఎజూా నుంచి ఇస్నాపూర్ వరకు ఆటోల ర్యాలీ; 7న ప్రజావాణిలో 420 హామీల అమలుపై వినతిపత్రాలు సమర్పించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు, రైతులు, కార్మికులు భారీగా పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

# ఊరకుంట పోచమ్మ తల్లి బోనాల్లో బీజేపీ నాయకుల ప్రత్యేక పూజలో పాల్గొన్న

- **బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి**





**మిడ్జిల్, సెప్టెంబర్ 1 (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో) :**
జడ్చర్ల మున్సిపల్ పరిధిలోని ఊరకుంటలో శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బోనాల కమిటీ అధ్యక్షుడు విక్కీ, సభ్యులు శివ, ఆంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో బీజేపీ నాయకులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి, జడ్చర్ల పట్టణ అధ్యక్షుడు ఎడ్ల అమర్నాథ్ గౌడ్, ప్రధాన కార్యదర్శి వెంకట్, రాష్ట్ర నాయకులు , జిల్లా ఉపాధ్యక్షుడు రాపోతుల శ్రీనివాస్ గౌడ్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సాహితి రెడ్డి, కిసాన్ మోర్చా నాయకులు మురళీకృష్ణ, నాయకులు కుమార్, శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పోచమ్మ తల్లి ఆశీస్సులతో జడ్చర్ల నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రతి కుటుంబంలో శాంతి, సౌభాగ్యం, అభివృద్ధి నెలకొనాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. బోనాల పండుగ సందర్భంగా భక్తులు, స్థానిక ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

## పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా ఉపాధ్యాయుల నిరసన

- సీపీఎస్ రద్దు చేసి.. ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి
- నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపిన ఘుడియ గౌరారం జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు



**చింతపల్లి, సెప్టెంబర్ 1 (నేటి దర్శిని):**
పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ చింతపల్లి మండలం ఘుడియ గౌరారం జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు.
భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు నల్లబ్యాడ్జీలు ధరించి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఉద్యోగుల పదవీ విరమణ అనంతర భవిష్యత్ భద్రతకు ఓపీఎస్ ఎంతో అవసరమని వారు పేర్కొన్నారు.
సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేసి.. ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఉపాధ్యాయులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

## చింతపల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులపై సమగ్ర విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి

- టీఎస్‌యూటీఎఫ్ చింతపల్లి మండల శాఖ




**చింతపల్లి, సెప్టెంబర్ 1(నేటి దర్శిని):**
చింతపల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల వ్యవహారశైలి, ఉపాధ్యాయుల పట్ల అనుసరిస్తున్న విధానాలు, విధుల నిర్వహణ, సెలవులు, ఓడీ తదితర అంశాలపై వస్తున్న ఫిర్యాదులు, ఆరోపణలపై విద్యాశాఖ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కాశిరెడ్డి కృష్ణారెడ్డి మరియు చింతపల్లి మండల అధ్యక్షులు సిలువేరు నారాయణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చింతపల్లి కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల్లో ఉపాధ్యాయుల విధుల నిర్వహణ, ఓడీ, సెలవుల విషయంలో అనుసరిస్తున్న విధానాలు, షోకాజ్ నోటీసులు జారీ చేయడం తదితర అంశాలపై ఉపాధ్యాయుల్లో ఆందోళన నెలకొందన్నారు. ఉపాధ్యాయులను ఉద్దేశపూర్వకంగా ఇబ్బందులకు గురిచేయడం సరికాదని పేర్కొన్నారు. పాఠశాలల పర్యవేక్షణ పేరుతో టూర్ డైరీ నిర్వహణ, పాఠశాలల సందర్శన, ఉపాధ్యాయులతో వ్యవహరిస్తున్న తీరు తదితర అంశాలను కూడా అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని వారు కోరారు. సంబంధిత ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది నుంచి వివరాలు సేకరించి నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని ఆయన అన్నారు. విద్యాశాఖ అధికారులు ఈ వ్యవహారంపై తక్షణమే స్పందించి సమగ్ర విచారణ జరిపి చింతపల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులపై నిబంధనల ప్రకారం శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు భయాందోళనలకు గురికాకుండా ప్రశాంతమైన వాతావరణంలో విధులు నిర్వహించేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ డబ్ల్యూ ఎఫ్ జిల్లా సభ్యులు గోన దేవకుమార్, మండల ప్రధాన కార్యదర్శి ముసుగు ఆనంద్ బాబు పాల్గొన్నారు.

## 67,442 కుటుంబాలకు
# స్మార్ట్ రేషన్ కార్డులు!

- వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో.. పేదల ఇంటికి సంక్షేమం
- దేవరకొండ నియోజకవర్గంలో 167 రేషన్ దుకాణాల పరిధిలో పంపిణీ
- "ఇది మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం"
- కేసీఆర్‌పై బాలు నాయక్ ఫైర్..
- రవీంద్రకుమార్‌కు సవాల్








**దేవరకొండ సెప్టెంబర్ 1(నేటి దర్శిని):**
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా పాలన వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా దేవరకొండ నియోజకవర్గంలో 67,442 కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేపట్టారు. దేవరకొండ పట్టణంలోని సాయి రమ్య ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ లబ్ధిదారులకు కార్డులు అందజేశారు.
పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అన్నారు. గత ప్రభుత్వ హయాంలో కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజలు ఏళ్ల తరబడి ఎదురుచూశారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులైన కుటుంబాలకు కొత్త కార్డుల జారీ ప్రక్రియ చేపట్టిందని తెలిపారు.
"సంక్షేమంలో కాంగ్రెస్ దూకుడు"సన్నబియ్యం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, ఆరోగ్యశ్రీ, రైతు సంక్షేమం, మహిళా సంక్షేమం, కొత్త రేషన్ కార్డులు వంటి అనేక పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని బాలు నాయక్ తెలిపారు. "రేషన్ కార్డు పేద కుటుంబానికి సామాజిక భద్రతకు ఆధారం. అర్హులైన ప్రతి కుటుంబానికి కార్డు అందేలా చర్యలు తీసుకుంటున్నాం" అన్నారు. కేసీఆర్‌పై నిప్పులు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఎమ్మెల్యే బాలు నాయక్ తీవ్ర విమర్శలు చేశారు. ప్రతిపక్ష నేతగా ప్రజల సమస్యలపై పోరాడాల్సిన కేసీఆర్ ప్రజలకు దూరంగా ఉన్నారని ఆరోపించారు. "ప్రజల సమస్యలను పట్టించుకోకుండా ప్రతిపక్ష హోదాను గాలికి వదిలేశారు. కేటీఆర్, హరీష్‌రావులను ముందు పెట్టి రాజకీయాలు నడిపిస్తున్నారు. ప్రజల కోసం బీఆర్ఎస్ ఏం చేస్తుందో చెప్పాలి" అని ప్రశ్నించారు. రవీంద్రకుమార్‌కు బాలు సవాల్ దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్‌పై బాలు నాయక్ తీవ్రస్థాయిలో స్పందించారు.
"15 సంవత్సరాలు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పీఏపల్లి మండలంలో ఒక్క తారు రోడ్డు వేసినట్టు నిరూపిస్తే.. నేను ఇప్పుడే రాజీనామా చేస్తా" అంటూ సవాల్ విసిరారు.
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేవరకొండ నియోజకవర్గంలోని ప్రతి మండలంలో రోడ్లు, తాగునీరు, విద్య, వైద్యం, సాగునీరు, సంక్షేమ రంగాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. వెయ్యి రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో నియోజకవర్గానికి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు తీసుకువస్తామని బాలు నాయక్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, జాయింట్ కలెక్టర్ జె. శ్రీనివాస్, ఆర్డీవో, మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవరెడ్డి, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, రేషన్ డీలర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## సూర్యగిరి ఎల్లమ్మ తల్లికి
# భట్టి విక్రమార్క ప్రత్యేక పూజలు

- తెలంగాణ ప్రజల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాల కోసం ప్రార్థనలు
- కిచ్చన్న లక్ష్మారెడ్డితో కలిసి రావిర్యాలలో అమ్మవారిని దర్శించుకున్న డిప్యూటీ సీఎం
- రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్ష







**మహేశ్వరం, సెప్టెంబర్ 01(నేటి దర్శిని):**
తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డితో కలిసి ఆయన సూర్యగిరి ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్నారు. మహేశ్వరం మండలం తుక్కుగూడ డివిజన్‌లోని రావిర్యాల గ్రామంలో ఉన్న సూర్యగిరి ఎల్లమ్మ తల్లి సన్నిధిలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో భట్టి విక్రమార్క, కిచ్చన్న లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించి రాష్ట్ర ప్రజల సంక్షేమం, శాంతి, సౌభాగ్యం కోసం ప్రార్థించారు. ఈ సందర్భంగా ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు తెలంగాణ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రత్యేకమైన స్థానం ఉందని పేర్కొన్నారు. గ్రామదేవతగా ఎల్లమ్మ తల్లిని కొలిచే భక్తుల విశ్వాసం తరతరాలుగా కొనసాగుతోందన్నారు. ప్రజల విశ్వాసాలు, సంప్రదాయాలకు గౌరవం ఇస్తూ ఎల్లమ్మ తల్లి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించడం విశేషమని పేర్కొన్నారు. కిచ్చన్న లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నాయకత్వంలో తెలంగాణ మరింత అభివృద్ధి చెందాలని, ప్రజా సంక్షేమం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలకు మరింత సేవ చేసే శక్తి, ఆరోగ్యం, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ప్రార్థించినట్లు తెలిపారు. తెలంగాణ ప్రజలందరికీ శాంతి, సంతోషం, సుభిక్షం కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ రౌడీ పాలన.. పోలీసులు ప్రేక్షక పాత్ర!

- బీజేపీ కార్యాలయంపై దాడి.. నల్లగొండ జిల్లా అధ్యక్షుడి ఇంటిపై దాడి
- తల్లిని అవమానించి.. ఇంటి సామాగ్రి ధ్వంసం చేశారంటూ బీజేపీ ఆగ్రహం
- చింతపల్లిలో రాస్తారోకో.. నల్లబ్యాడ్జీలతో నిరసన

**చింతపల్లి సెప్టెంబర్ 1(నేటి దర్శిని):**
తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల తరఫున ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడుతోందని చింతపల్లి బీజేపీ నాయకులు ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యాలయంపై దాడితో పాటు నల్లగొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి ఇంటిపై దాడి చేసి, ఆయన తల్లిని అవమానించడమే కాకుండా ఇంట్లోని సామాగ్రి, ఫర్నిచర్‌ను ధ్వంసం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.



**పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు!**
ప్రతిపక్ష నాయకుల ఇళ్లపై దాడులు, కుటుంబ సభ్యులను బెదిరించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని బీజేపీ నాయకులు మండిపడ్డారు. దాడులకు పాల్పడిన వారిపై వెంటనే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**రాస్తారోకో.. నల్లబ్యాడ్జీలతో నిరసన**
దాడులను నిరసిస్తూ చింతపల్లి బీజేపీ మండల అధ్యక్షుడు సముద్రాల నగేష్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివర్ల రమేష్, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కుకుడపు రామకృష్ణ, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి చెనమోని రాములు, మైనారిటీ జిల్లా కార్యదర్శి జహంగీర్, మండల ఉపాధ్యక్షుడు కొణిదెల శ్రీను, ప్రధాన కార్యదర్శులు వెన్నం శేఖర్, గొడుగు శ్రీను, పున్న భీమేష్, బూత్ అధ్యక్షులు, వార్డు సభ్యులు, స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. దాడులకు పాల్పడిన వారిపై పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని, ప్రతిపక్ష నాయకులు, వారి కుటుంబాలకు రక్షణ కల్పించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు.







# జీవితానికి భరోసా సిఎంఆర్ఎఫ్

**- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**
**-నిమ్స్‌లో చికిత్సకు షాద్‌నగర్ వాసికి సీఎం సహాయ నిధి రూ.3 లక్షల ఎల్ఓసీ**



**రంగారెడ్డి జిల్లా సెప్టెంబర్ 01 (నేటి దర్శిని):**
అనారోగ్యంతో చికిత్స పొందుతున్న షాద్‌నగర్‌కు చెందిన మెరెడ్డి శ్రీనివాస్‌రెడ్డికి ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్ఎఫ్) ద్వారా రూ.3 లక్షల ఆర్థిక సహాయం మంజూరైంది. ఇందుకు సంబంధించిన లోకల్ ఆర్డర్ కాపీని ముఖ్యమంత్రి కార్యాలయం నిమ్స్ ఆసుపత్రి డైరెక్టర్‌కు పంపింది. షాద్‌నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ ఈ నెల 22న ముఖ్యమంత్రి కార్యాలయానికి చేసిన విజ్ఞప్తి మేరకు ఈ సహాయం మంజూరైనట్లు లేఖలో పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లోని నెహ్రూనగర్ కాలనీకి చెందిన మెరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి కుమారుడిగా లేఖలో పేర్కొన్నారు. జీవితానికి ముప్పు కలిగించే ఇతర అనారోగ్య పరిస్థితికి చికిత్స పొందేందుకు రూ.3,00,000 వరకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరు చేయనున్నట్లు సీఎం కార్యాలయం వెల్లడించింది. హైదరాబాద్ పంజాగుట్టలోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)లో అవసరమైన చికిత్స అందించాలని ఆసుపత్రి డైరెక్టర్‌ను ఆదేశించింది. చికిత్స పూర్తయిన అనంతరం సంబంధిత బిల్లును సమర్పించాలని సీఎం కార్యాలయం సూచించింది. ఈ మేరకు ఆగస్టు 25, 2026న ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి అధికారికంగా లేఖ జారీ అయింది. అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న శ్రీనివాస్‌రెడ్డికి సీఎం సహాయ నిధి ద్వారా రూ.3 లక్షల సాయం అందేలా ఎమ్మెల్యే శంకరయ్య చొరవ తీసుకోవడంపై కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, పార్టీ అధ్యక్షుడు శ్రీధర్, సీనియర్ నేత చెంది తిరుపతిరెడ్డి, ముబారక్ అలీ ఖాన్ తదితరులు ఉన్నారు.

# ఏఐకేఎంఎస్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

**- జిల్లా కార్యదర్శి బి. మల్లేశ్**



**(నేటి దర్శిని): పరిగి, సెప్టెంబర్ 01:**
మంచిర్యాల జిల్లా కేంద్రంలో సెప్టెంబర్ 8, 9 తేదీల్లో నిర్వహించనున్న అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) తెలంగాణ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం పరిగిలో మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బి. మల్లేశ్ మాట్లాడుతూ, పాలకవర్గాల రైతు వ్యతిరేక విధానాలు, సరళీకరణ ఆర్థిక విధానాల కారణంగా దేశంలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీ రైతాంగ పోరాట సమయంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నేటికీ అమలు చేయకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. విదేశాలతో, ముఖ్యంగా అమెరికాతో కుదుర్చుకున్న అసమాన ఒప్పందాల వల్ల రైతులకు గిట్టుబాటు ధర దక్కకుండా పోతోందని, వెంటనే ఆ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే బహుళజాతి కంపెనీల నకిలీ, అనుమతిలేని విత్తన వ్యాపారాలను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని మండిపడ్డారు. ఈ సమస్యలపై రాబోయే మహాసభల్లో చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తామని స్పష్టం చేశారు. కావున జిల్లా నలుమూలల నుంచి రైతులు, కూలీలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ సభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు జె. శివకుమార్, ఎం. యాదయ్య, కె. అంజయ్య, పి. మాణిక్యం, బి. నర్సింలు, టి. మల్లేష్, ప్రకాష్, నరేందర్, మహేందర్, శ్రీశైలం, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# వేముల్ నార్వ,చౌదరి గూడలో హైమాస్ట్ లైట్స్ ప్రారంభోత్సవం

**-ప్రారంభించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి**
**-ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సొంత నిధులతో ఏర్పాటు**
**పట్ల హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు**



**రంగారెడ్డి జిల్లా సెప్టెంబర్ 01 (నేటి దర్శిని):**
కేశంపేట మండలం వేముల్ నార్వ మరియు చౌదరి గూడలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన రెండు హైమాస్ట్ లైట్లను నిన్న రాత్రి సోమవారం గ్రామస్తుల సమక్షంలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి తన సొంత నిధులతో తమ గ్రామాలలో అభివృద్ధి పనులలో భాగంగా హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయడం ఎంతో గొప్ప విషయమని గ్రామస్తులు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియస్తూ రానున్న కాలంలో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి తమ గ్రామాలను మరింత అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రఘునాథ్ యాదవ్,వేమూల్ నార్వ సర్పంచ్ పల్లెమోని సువర్ణ నర్సిములు,కేశంపేట సర్పంచ్ బుజ్జం సంతోష శ్రీశైలం యాదవ్,పోమాల్ పల్లి సర్పంచ్ స్వప్న భూపాల్ రెడ్డి,ఇప్పలపల్లి సర్పంచ్ మంజుల జంగయ్య,లింగందాన సర్పంచ్ నాగిల్ల వెంకటేష్,కమ్మదనం సర్పంచ్ లతాకిరణ్ గౌడ్,తూర్పుగడ్డ తండా థౌర్య నాయక్,భైర్కాన్ పల్లి సర్పంచ్ తనయుడు శివ యాదవ్,మాజీ సర్పంచులు,తాంద్ర విష్ణువర్ధన్ రెడ్డి,శేఖర్ పంతులు,యారం శేఖర్ రెడ్డి,ఆంజనేయులు యాదవ్,ప్రభాకర్ రెడ్డి,మీనమోనిపల్లి సత్య నారాయణ, క్రిష్ణయ్య, మాజీ ఎంపిటిసి కోటేశ్వర్,ఉపసర్పంచులు యారం రామ్ రెడ్డి,సహదేవ్, మాజీ ఉపసర్పంచ్లు సుదర్శన్ గుప్త,నాయకులు వేములనర్వ మల్లేష్,తుకారాం, మురళి,జగన్ రెడ్డి,క్రిష్ణ,సత్య నారాయణ, సాయిరాం,అబిశ్రీను,వేమూల్ నార్వ, చౌదరిగూడ గ్రామస్థులు మరియు మండల బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు, మహిళ, పేద, యువత సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం:వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య

**●1000 వెయ్యి రోజుల్లో తెలంగాణ లో సంక్షేమం, అభివృద్ధితో ప్రజల గుండెల్లో కాంగ్రెస్**



**ఉమ్మడి వరంగల్, సెప్టెంబర్ 1 (నేటి దర్శిని బ్యూరో)**
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజుల ప్రజాపాలనను విజయవంతంగా పూర్తి చేసుకుందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. హనుమకొండలోని డీసీసీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ ఈ 1000 రోజుల్లో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత కాంగ్రెస్ శ్రేణులపై ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత 32 నెలల్లో రైతుల కోసం రూ.1.68 లక్షల కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. హామీ మేరకు రూ.2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేసి 25 లక్షల రైతు కుటుంబాలకు రుణవిముక్తి కల్పించామని చెప్పారు. రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లు విడుదల చేయగా, కేవలం 9 రోజుల్లోనే రూ.9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని పేర్కొన్నారు. సన్నబియ్యం సాగును ప్రోత్సహించేందుకు క్వింటాలుకు రూ.500 బోనస్‌తో పాటు ఉచిత విద్యుత్, రైతు బీమా పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు.
యాసంగి సీజన్‌లో 81 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి, ధాన్యం ఉత్పత్తిలో పంజాబ్‌ను అధిగమించి తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందన్నారు.
మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని కావ్య అన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఇప్పటివరకు రూ.11 వేల కోట్ల ప్రయాణ వ్యయం ఆదా అయిందన్నారు. గృహజ్యోతి ద్వారా 53 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకం ద్వారా 43 లక్షల మంది మహిళలకు లబ్ధి చేకూరిందని తెలిపారు. మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు 4.50 లక్షల స్వయం సహాయక సంఘాలకు బ్యాంక్ లింకేజీ ద్వారా రూ.60 వేల కోట్ల రుణాలు అందించామని చెప్పారు. మహిళా సంఘాలకు సోలార్ పవర్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు, ఆర్టీసీ బస్సుల నిర్వహణ వంటి అవకాశాలను కల్పిస్తున్నామని వివరించారు. 15 లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేసి మొత్తం 3.38 కోట్ల మందికి పీడీఎస్ ద్వారా లబ్ధి అందిస్తున్నామని తెలిపారు. 43 లక్షల మందికి పైగా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెన్షన్లు అందిస్తున్నామని, మరో 2.25 లక్షల మందికి కొత్తగా పెన్షన్లు మంజూరు చేశామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా తొలి విడతలో 4.50 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టి, ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల టవర్లు, వరంగల్‌లో టవర్ ఫ్లాట్ల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు.
దేశంలోనే తొలిసారిగా బీసీ కులగణన పూర్తి చేసి, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేలా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపామని కావ్య తెలిపారు. ఎస్సీ వర్గీకరణ అమలుకు కూడా అసెంబ్లీలో తీర్మానం చేశామని చెప్పారు. 12 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కనీస వేతనాల సవరణతో 1.11 కోట్ల మంది కార్మికులకు ప్రయోజనం కలిగిందన్నారు. గిగ్ వర్కర్లకు చట్టబద్ధ గుర్తింపు కల్పిస్తూ ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేశామని తెలిపారు. తెలంగాణ విద్యా రంగం పనితీరు మెరుగుపడి పెర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్‌లో 28వ స్థానం నుంచి 18వ స్థానానికి చేరిందన్నారు. ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టామని చెప్పారు. మెగా డీఎస్సీ ద్వారా 10 వేల ఉపాధ్యాయ నియామకాలు పూర్తి చేశామని, తొలి 1000 రోజుల్లోనే 72 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను పూర్తి చేశామని తెలిపారు. యువతకు నైపుణ్య శిక్షణ అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచామని చెప్పారు. గోషామహల్‌లో రూ.2,700 కోట్లతో 2 వేల పడకల ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం చేపట్టామని, నిమ్స్‌లో 2 వేల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తయ్యాయని తెలిపారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణ ఆర్థికంగా తీవ్ర సవాళ్లను ఎదుర్కొన్నప్పటికీ, రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతోందని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య అన్నారు. గత ప్రభుత్వాలు సాధించలేని అనేక అభివృద్ధి కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం వేగంగా పూర్తి చేస్తోందన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు ప్రభుత్వంపై అవాస్తవాలు ప్రచారం చేయడం దురదృష్టకరమన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా తెలంగాణపై వివక్ష చూపుతోందని ఆరోపించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ప్రాజెక్టులు, విభజన హామీలను అమలు చేస్తే తెలంగాణ అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని అన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని అవాస్తవాలు ప్రచారం చేసినా కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల విశ్వాసం రోజురోజుకూ పెరుగుతోందని ఎంపీ డా. కావ్య అన్నారు. రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని, దేశంలో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావడం ఖాయమని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్, డిసిసి అధ్యక్షులు , కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# 3,75 కోట్లతో నిర్మించనున్న సిసి రోడ్లు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన : ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**●డ్రైనేజీ వ్యవస్థ రూపురేఖలు మారుస్తా: ఎమ్మెల్యే**

**ఉమ్మడి వరంగల్, సెప్టెంబర్ 1 (నేటి దర్శిని బ్యూరో):**
గ్రేటర్ వరంగల్ మున్సిపాలిటీ 1వ, 65వ , 66వ డివిజన్లలో 3కోట్ల 75లక్షల విలువ గల సిసిరోడ్లు,డ్రైనేజీ పనులకు మంగళవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దాదాపు 20 నుంచి 25 ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న రోడ్ల సమస్య,డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు ఈ అభివృద్ధి పనులు చేపట్టామని అన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గానికి అభివృద్ధి పథంలో తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. దశల వారీగా అన్ని డివిజన్లో,అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చేపడతమన్నారు. అసత్య ప్రచారాలు చేస్తున్న ప్రతిపక్ష నాయకులకు ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెప్తారన్నారు. గత రెండు సార్లు అధికారంలో ఉండి అభివృద్ధి చేయని నాయకులు అసత్య ప్రచారాలతో కాలం వెల్లబుచుతున్నారని మండిపడ్డారు. ఎక్కడ సమస్యలు ఉన్న డయల్ యువర్ ఎమ్మెల్యే నెంబర్ కి సంప్రదించి సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో 1వ డివిజన్ అధ్యక్షులు చిర్ర రాము,65వ డివిజన్ అధ్యక్షులు సునీల్, 66వ డివిజన్ అధ్యక్షులు గొర్రె కిరణ్,ఎనుమాముల మార్కెట్ డైరెక్టర్ రైతు రాజు,ఆత్మకూరు మార్కెట్ వైస్ చైర్మన్ తిరుపతి,హసన్పర్తి మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు రాకేష్ రెడ్డి,హనుమకొండ జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు పింగిలి వెంకటరెడ్డి, హసన్పర్తి మండల అధ్యక్షులు అశోక్, హసన్పర్తి మాజీ మండల అధ్యక్షులు పోరెడ్డి మహేందర్ రెడ్డి,66 వ డివిజన్ మాజీ అధ్యక్షులు కనపర్తి కిరణ్,మండల మహిళ ఉపాధ్యక్షురాలు స్వాతి,సీనియర్ నాయకులు దేవరకొండ అనిల్,చంటి రెడ్డి,ఎర్ర ప్రకాష్,శ్రీకాంత్ రెడ్డి, విసం సురేందర్ రెడ్డి, భాషా,వేణు,కుమారస్వామి వెంకటస్వామి, ఆనంద్, ఎల్ఐసి వెంకన్న, నరసింహ, రాములు, శ్రీనివాస్,డివిజన్ల ముఖ్యనాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, RNI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365